వైఎస్ఆర్-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
గురువారం 12 సెప్టెంబర్ 2024

## ఘనంగా వినాయకుడి లడ్డూ వేలంపాట

ఖాజీపేట, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త:



మండలంలో కుల మతాలకు అతీతంగా పూజలు అందుకున్న వినాయకులు నిమజ్జనానికి బయల్దేరారు. నిమజ్జనానికి వెళ్లే ముందు ముఖ్యమైన ఘట్టంగా భావించే వినాయక లడ్డూ వేలం పాటలు ఈ ఏడాది ఖాజీపేట మండలంలో జోరుగా సాగాయి. ఈ క్రమంలోనే మండల పరిధిలోని దుంపలగట్టు గ్రామం నందు ఏర్పాటుచేసిన వినాయక విగ్రహం దగ్గర లడ్డు వేలం పాటలో దుంపలగట్టు గ్రామానికి చెందిన తవ్వా కిశోర్ రెడ్డి, భార్య ఉమాదేవిలు 92,000 రూపాయలకు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేలం పాటలో గణపతి లడ్డు దక్కించుకోవడం చాలా సంతోషంగా ఉందని ఆ స్వామి వారి దయ ఉంటే వచ్చే సంవత్సరం కూడ లడ్డు వేలంపాటలో పాల్గొని కైవసం చేసుకుంటామన్నారు.

## గోల్డ్ మెడల్ సాధించిన నాగరాజుకు ఘన సన్మానం

వీరబల్లి, సెప్టంబర్ 11, ప్రభాతవవార్త :



మండలంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2011వ సంవత్సరంలో ఇంటర్మీడియట్ పూర్తి చేసుకొని ఆటల పోటీల్లో ప్రతిభ కనబరుస్తూ ఇటీవల అంతర్జాతీయంగా నేపాల్‌లో జరిగిన పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్ సాధించిన నాగరాజును బుధవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు ఆయనకు ఘన సన్మానం చేశారు. అలాగే సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమములో కళాశాల ప్రిన్సిపాల్ అజంతుల్లా నాగరాజుకు పూలదండతో సాలువాలు కప్పి సన్మానం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు చదువులోనే కాకుండా ఆటల పోటీల్లో కూడా ప్రతిభ కనబరచాలన్నారు. నాగరాజును ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. అధ్యాపకులు నాగరాజుకు రూ.5వేలు నగదు బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగాం అధికారులు, భాస్కర్, అధ్యాపకులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### వృత్తి ధర్మాన్ని బాధ్యతాయుతంగా నిర్వర్తించడంతోపాటు

# ప్రాణాలకు ముప్పు రాకుండా విధి నిర్వహణ చేయాలి

కడప, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త





వృత్తి ధర్మాన్ని బాధ్యతాయుతంగా నిర్వర్తించడంతోపాటు మన ప్రాణాలకు ముప్పు రాకుండా విధి నిర్వహణను బాధ్యతను నిర్వర్తించాలని జాతీయ అటవీశాఖ అమరవీరుల సంస్కరణ దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ శివశంకర్, జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు, జిల్లా అటవీశాఖ అధికారి సందీప్‌రెడ్డిలు సంయుక్తంగా పేర్కొన్నారు. బుధవారం స్థానిక జిల్లా అటవీశాఖ అధికారి కార్యాలయం ఆవరణంలో జాతీయ అటవీశాఖ అమరవీరుల సంస్కరణ దినోత్సవంను జిల్లా అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శివశంకర్ మాట్లాడుతూ వృత్తి ధర్మాన్ని బాధ్యతాయుతంగా నిర్వర్తించడంతోపాటు మన, మన కుటుంబ సభ్యుల గురించి ఆలోచించి మన ప్రాణాలకు ఎలాంటి ముప్పు కలగకుండా విధి నిర్వహణ చేయాలన్నారు. వందేమాతరం గేయంలో సుజలాం, సుఫలాం, మలయజశీతలాం, సస్యశ్యామలం అంటే మంచి నీరు ఉండాలని, మంచి ఫలాలుండాలని, మంచి వ్యవసాయం పండాలని, మంచి గాలులు, ప్రకృతి అన్నది చక్కగా ఉండాలని పర్యావరణం సమతుల్యత అన్నది సరిగ్గా ఉండాలన్నారు. కడప జిల్లాలో అత్యధికంగా అటవీప్రాంతం ఉన్నదని, జిల్లాకు ఎంతో గర్వకారణమన్నారు. ఇంతగా అటవీప్రాంతం ఉందంటే అది అంతా అటవీశాఖ అధికారులు, సిబ్బంది కృషి అన్నారు. మన అటవీ సంపదను కాపాడుకోవాలని భవిష్యత్ తరాల వారికే కాకుండా ప్రస్తుతం ఉన్న వారి అవసరాలను తీర్చుకోనడమే సుస్థిర అభివృద్ధి అన్నారు. అటవీ వనరుల సంరక్షణ వృత్తి బాధ్యతను చక్కగా నిర్వర్తించడంతోపాటు తమ కుటుంబసభ్యుల కోసం ప్రాణం మీదకు తెచ్చుకోరాదన్నారు. జిల్లా అటవీశాఖ అధికారి సందీప్‌రెడ్డి ఆధ్వర్యంలో అటవీ ప్రాంతాన్ని బాధ్యతాయుతంగా, సమర్థవంతంగా, అందరినీ కలుపుకుంటూ సమన్వయం చేసుకుంటూ చక్కగా విధి నిర్వహణలో నిర్వర్తించడం జరుగుతోందన్నారు. తప్పు చేసే వారి కంటే బాగా ఆలోచించి తమ విధి నిర్వహణలో ఆలోచన ధోరణిని తేజస్సుగా మార్చుకుని విధి నిర్వహణను నిర్వర్తించాలన్నారు. సినిమాల్లో తప్పుచేసే వారిని కథానాయకుడిగా చూపించడం జరుగుతోందని అది సరికాదని సమాజానికి మంచి సందేశాన్ని ఇచ్చే విధంగా ఉండాలన్నారు. మంచి చెడులు మన పక్కనే ఉంటాయని మనం మంచి వైపే ఉండాలని ఉంటామని అన్నారు. అటవీ ప్రాంత సంరక్షణలో మన ప్రాణ నష్టం కలగకుండా వృత్తి ధర్మాన్ని నిర్వర్తించాలన్నారు. అవతల వారి ప్రవర్తను బట్టి మన ప్రవర్తనను కూడా తెలివిగా మార్చుకుని నడవాలన్నారు. అటవీశాఖలో అధునాతన వస్తు సామాగ్రి, సదుపాయాలను కల్పించడం జరుగుతుందని, మనం ఇంకా తెలివిగా ఉండి ఆధునికతను నేర్చుకుని విధి నిర్వహణను నిర్వర్తించాలన్నారు. అటవీశాఖలో ఇంటెలిజెన్స్, కమాండ్ కంట్రోల్‌ను ఏర్పాటు చేసుకోవాలని అందుకు సహాయ సహకారాలు తమ నుండి ఎస్పీ నుండి అందిస్తామన్నారు. మనం చాకచక్యంగా ఉండి ఆవతలి వారి ఎత్తులను ఓడించాలన్నారు. అనాలోచితంగా కాకుండా ఆలోచించి నిర్ణయం తీసుకుని ముందుకెళ్లాలన్నారు. వృత్తి ధర్మాన్ని జవాడుతనంగా నిర్వర్తిండంతోపాటు మన జీవితాలను కూడా కాపాడుకోవాలన్నారు. అటవీశాఖలో వృత్తి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అశోక్ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు. వారి కుటుంబ సభ్యులకు ఇంకా సహాయం చేస్తామనాన్నరు. జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు మాట్లాడుతూ అటవీ ప్రాంత సంరక్షణ ఎంతో బాధ్యతాయుతమైన వృత్తి అని కష్టంతోపాటు తెలివిగా విధి నిర్వహణను నిర్వర్తించుకోవాలన్నారు. విధి నిర్వహణలో ఎంత ఒత్తిడి ఉన్నా తెలివిగా మంచి మార్గాన్ని ఎంచుకోవాలన్నారు. ప్రాణం కంటే ఎక్కువ ఏది కాదని అటవీ ప్రాంత సంరక్షణలో పొరపాట్లుకు తావివ్వకుండా ఆలోచించి ముందుకెళ్లాలన్నారు. విధి నిర్వహణలో అశువులు బాసిన అశోక్ వారి కుటుంబ సభ్యులకు ప్రఘాడ సంతాపం తెలిపారు. జిల్లా అటవీశాఖ అధికారి సందీప్‌రెడ్డి మాట్లాడుతూ అటవీ ప్రాంత సంరక్షణ మన అందరి బాధ్యత అని విధి నిర్వహణను సమర్థవంతంగా నిర్వర్తించుకోవడంతోపాటు మనల్ని మనము కాపాడుకోవాలన్నారు. విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని ముందస్తు ఆలోచనలతో ఉండాలన్నారు. తొలుత జిల్లా కలెక్టర్ శివశంకర్, జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు, జిల్లా అటవీశాఖ అధికారి సందీప్‌రెడ్డిలు అటవీశాఖ అమరవీరుల స్తూపం వద్ద పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. చివరిగా అటవీశాఖ విధి నిర్వహణలో అసువులు బాసిన అశోక్ వారి తల్లికి జాతీయ అటవీశాఖ అమరవీరుల దినోత్సవం సందర్భంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శివశంకర్, జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, జిల్లా అటవీశాఖ అధికారి సందీపప్రెడ్డిలతో పాటు డివిజనల్ అటవీ అధికారులు గురుప్రభాకర్, నాగార్జునరెడ్డి, అటవీశాఖ అధికారులు, సిబ్బంది, అటవీశాఖ అమరవీరుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## జీవో నెంబర్ 115ను నిలుపుదల చేయాలి



ప్రొద్దుటూరు అర్బన్, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త:

తక్షణమే రాష్ట్ర, వైద్య ఆరోగ్య శాఖలో వివిధ విభాగాలలో డీఎంఈ, డీహెచ్ఎస్, డిపిహెచ్, ఎన్‌హెచ్ఎం, ఎస్ఎన్‌సియులలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులను అందరిని రెగ్యులర్ ప్రతిపాదికన క్లియర్ వేకంట్ పోస్టులతో భర్తీ చేయవలసిందిగా అంతవరకు జీఓ నెంబర్ 115ని నిలుపుదల చేయవలసిందిగా ప్రొద్దుటూరు 350పడకల జిల్లా ఆసుపత్రి నందు కాంట్రాక్ట్ నర్సులుగా పనిచేస్తున్న ఉద్యోగులు ఆసుపత్రి ఆవరణంలో తమ డిమాండ్లను తెలియజేశారు. కరోనా లాంటి విపత్కర పరిస్థితిలో కూడ ఎటువంటి అదనపు జీతం పొందకుండానే తాము కాంట్రాక్ట్ జీతంతోనే విధులను నిర్వహించడం జరిగిందని, గత ప్రభుత్వం కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని జీవో తీసుకువచ్చి సెప్టెంబర్ 2014 వరకే కట్ ఆఫ్ తేదిని నిర్ణయించడంలో రాష్ట్రంలో ఏ ఒక్క స్టాఫ్ నర్సింగ్ కూడ రెగ్యులర్ ఉద్యోగానికి నోచుకోలేదని, ప్రస్తుత ప్రభుత్వంలో అయినా తమకు న్యాయం జరుగుతున్నట్లు ఆశిస్తున్నామని, అయితే ఈ నెల నాలుగవ తేదిన వైద్య ఆరోగ్య శాఖ విడుదల చేసిన జీవో నెంబర్ 115లో ఇంటెన్సిఫైడ్ ప్రోగ్రాం రెండు సంవత్సరాల కోర్సును చేసిన వారికే రెగ్యులర్ ప్రాతిపదికలో క్లియర్ వేకంట్ పోస్టులను నియమించనున్నట్లు జీవోలో పేర్కొన్నారని, ఈ జీవో వలన గడిచిన 10-15 సంవత్సరాల నుండి వైద్య ఆరోగ్య శాఖలోని వివిధ విభాగాలలో పనిచేసిన వారికి మొండి చేయి దక్కుతుందని, కాంట్రాక్ట్ పద్ధతుల్లో విధులు నిర్వహిస్తున్న తమను కూడ రెగ్యులర్ చేయకుండా ఏఎన్ఎం టు జీఎన్ఎం ఇంటెన్సిఫైడ్ టూ ఇయర్స్ ప్రోగ్రాం చేసిన వాళ్లని మాత్రమే రెగ్యులర్ స్టాఫ్ నర్సు పోస్టులలోకి నియమించడం ఎంతవరకు ఆమోదయోగ్యం అని ప్రశ్నించారు. కావున ముందుగా వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న జీఎన్ఎం, బిఎస్సీ నర్సింగ్, ఎంఎస్సీ నర్సింగ్, కాంట్రాక్ట్ నర్సులను రెగ్యులర్ చేసి, తక్షణమే జీవో నెంబర్ 115ని రద్దు చేయాలని తమకు న్యాయం చేయవలసిందిగా ప్రభుత్వాన్ని కోరారు. లేని ఎడల కాంట్రాక్ట్ నర్సెస్ అందరు కూడ నిరసన తెలియజేస్తామని, పోరాటాలకు సన్నద్ధం అవ్వాల్సి వస్తుందని, ఈ విషయంలో ప్రభుత్వం తగు నిర్ణయం తీసుకోవాలని కోరారు.

### మండపాలకు వసూలు చేసే శ్రద్ధ

## విద్యుత్తు తీగలు సరిచేసే వాటిపై లేదా..

జమ్మలమడుగు, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:

పట్టణంలో గణేష్ విగ్రహాల నిమజ్జనానికి వెళ్లే క్రమంలో పట్టణంలో వార్డులలో విద్యుత్తు తీగలు ప్రమాదకరంగా వేలాడుతున్న పరిస్థితి అని అధికారులు సరిచేయాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానంగా పట్టణంలోని వార్డులలో వినాయకుని విగ్రహాలు ఏర్పాటు చేసుకున్నారని అయితే వీటిని నిమ్జనం చేయాలంటే ప్రజలు విద్యుత్తు తీగలు కిందికి వేలాడడం వల్ల ఇబ్బందలకు గురవుతున్నారని సరిచేయాల్సిన అధికారులు కేవలం మండపాలకు విద్యుత్తు ఛార్జీలు వసూలు చేసే శ్రద్ధ తీగలను సరిచేయడంలో లేదని ఇప్పటికైనా ప్రమాదాలు జరగకుండా విద్యుత్తు తీగలు సరిచేయాలని డీవైఎఫ్ఐ యువజన సంఘం కోరుతోందన్నారు.

## పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు



ముద్దనూరు, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త:

ముద్దనూరు మండలంలోని కె.తిమ్మాపురం మరియు పెనికలపాడు గ్రామంలో బుధవారం నాడు జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి యూ.నాగభూషన్ రెడ్డి మరియు వ్యవసాయ పరిశోధన స్థానం కడప, ఆగ్రోనామి శాస్త్రవేత్త టి.భాగవంత ప్రియ, స్థానిక ఏడిఏ వి.వెంకట కృష్ణారెడ్డితో కలిసి పత్తి పంటలో గులాబి రంగు పురుగు గురించి అవగాహన సమావేశం ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త టి.భాగవత ప్రియ మాట్లాడుతూ పత్తి పంటలో గులాబి రంగు పురుగు నివారణకు సంబంధించి పలు సూచనలు అందించారు. ఇందులో భాగంగా ముందు జాగ్రత్తగా ఒక ఎకరం పొలంలో 5 చొప్పున లింగాకర్షక బుట్టలు ఏర్పాటుచేసుకోవాలని రైతులకు తెలిపారు. అలాగే పురుగు ఉధృతిని గమనించినప్పుడు తయోడి కార్బ్ 1.5గ్రాము ఒక లీటర్ నీటితో కలిపి పిచికారి చేసుకోవాలని కోరారు. అలాగే ఏవో నాగభూషన్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి రైతు సకాలంలో గులాబి రంగు పురుగు యాజమాన్య పద్ధతులు పాటిస్తే దిగుబడులు తగ్గకుండా చూడవచ్చు అని, అలాగే వేప నూనె మొదటి దశలో ఒక లీటరు నీటికి 5ఎంఎల్ పిచికారి చేసుకుంటే మంచి ఫలితాలు ఉంటాయని తెలిపారు. తదుపరి గ్రామంలో సాగు చేసిన పత్తి పంటను పరిశీలించి గులాబి రంగు పురుగు ఉధృతిని గమనించారు. రసం పీల్చే పురుగుల ఉధృతిని నివారించుటకు పసుపు రంగు జిగురు అట్టలు పెట్టుకోవాలని కోరారు. తదుపరి కొర్ర పంటను పరిశీలించి రైతులతో సాగు ఖర్చు వివరాలు మరియు సాగు పద్ధతుల గురించి తెలుసుకున్నారు. కొర్ర రకాల గురించి రైతులకు వివరించారు. అలాగే శనగ పంటలో యన్.బి.ఈ.జి 452 రకం రైతులకు మిషన్ కోతకు మంచి అనువైన రకం అని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ రైతులు వ్యవసాయ అధికారులు సూచనలు శాస్త్రవేత్తల సలహాలు పాటించాలని తెలిపారు. మండల వ్యవసాయ అధికారి వెంకట కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అనుసరించి పంటలు సాగు చేయాలని కోరారు. అలాగే పంట మార్పిడి పద్ధతి అవలంభించాలి అని సూచించారు. రబిలో సాగు చేసే అన్ని పంటలకు తప్పనిసరిగా విత్తే ముందు విత్తన శుద్ధి చేసుకోవాలని, విత్తన శుద్ధి చేయడం వలన చీడ పీడలు రాకుండా ముందు జాగ్రత్త చర్యలు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యమ్.పి.ఈ.ఓ.యమ్ జ్యోతి, బి.ప్రసాద్ రెడ్డి, యన్.వీరారెడ్డి, గోపాల్ రెడ్డి, సి.రామకృష్ణారెడ్డి పలువురు రైతులు పాల్గొన్నారు.

## వివిధ సమస్యలపై నేషనల్ మజ్దూర్ యూనియన్ నిరసన

ప్రొద్దుటూరు అర్బన్, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త:




జిల్లాలోని అన్ని డిపోలలో రీజనల్ కమిటీ పిలుపుమేరకు నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ గురువారం ఆర్టీసి డిపో వద్ద ఒక రోజు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ గత 8 నెలలుగా కడప డిటిపిఓకి జిల్లా వ్యాప్తిత సమస్యల గురించి అనేక మార్లు మౌఖికంగా వ్రాత పూర్వకంగా విజ్ఞప్తి చేసినప్పటికి పెడచెవిన పెట్టి సమస్యలు పరిష్కరించక జిల్లాలోని ఉద్యోగస్థులను తీవ్ర ఇబ్బందులకు గురి చేసినారన్నారు. మా రీజనల్ కమిటి గవర్నమెంట్‌కు వ్యతిరేకంగా కానీ, పాలసీలకు విరుద్ధంగా కాని, ఏపీపీటీడీ పాలసీలకు వ్యతిరేకంగా గాని ఆందోళన కార్యక్రమాలు నిర్వహించడం లేదని కేవలం డీపీటీఓ నిరంకుశ వైఖరికి, జిల్లాలోని అధికారులు, సూపర్‌వైజర్లపై నియంత్రణ కోల్పోవడం, కేంద్ర కార్యాలయ ఆదేశాలు పాటించకపోవడం, సంస్థ నియమ నిబంధనలు పాటించకపోవడం అక్రమ బదిలీలు, అక్రమ సస్పెన్షన్‌లు, డిపోలో కొందరు డిపో మేనేజర్లు, సూపర్‌వైజర్ల తప్పులకు మద్దతు పలకడం వంటి అనేక చర్యలకు నిరసనగా ఈరోజు ఆందోళన కార్యక్రమాలు నిర్వహించవలసిన పరిస్థితి కల్పించారన్నారు. తన పరిధిలోని సమస్యలు పరిష్కరించగల సామర్థ్యం ఉండి కూడ పరిష్కారం పట్ల నిబద్ధత లేకపోవడం వల్ల మా రీజనల్ కమిటీ ఈ నిర్ణయం తీసుకోవలసి వచ్చిందని, జమ్మలమడుగు డిపో మేనేజర్ పక్షపాత వైఖరి, ఏకపక్ష నిర్ణయాలు, అక్రమ రికవరీలు సమస్యలు పట్టించుకోవడంపై అనేక మార్లు విన్నవించిన స్పందించలేదని అదేవిధంగా కడప, మైదుకూరు,బద్వేలు డిపో మేనేజర్లు మొండి వైఖరీ, ఏకపక్ష నిర్ణయాలు, అక్రమ రికవరీలు సమస్యలు పట్టించుకోవడంపై అనూక మార్లు విన్నవించిన స్పందించలేదని అదేవిధంగా కడప, మైదుకూరు, బద్వేలు డిపో మేనేజర్లు మొండి వైఖరితో వ్యవహరిస్తూ సమస్యలు పరిష్కారం చేయలేదని విన్నవించినా చర్యలు లేవన్నారు. ఆందోళన కార్యక్రమాలు నిర్వహించకుండా నివారణ చర్యలు చేపట్టాలని పలుమార్లు డిపిటిఓ దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే ఆఫీస్ వద్ద రిలే నిరాహార దీక్షలు, ఛలో డిపిడిఓ ఆఫీస్, అటు పిమ్మట జిల్లా కలెక్టర్‌కి మెమొరాండం సమర్పించి అక్కడ రిలే నిరాహార దీక్షలు ఏర్పాటుచేసి జిల్లా వ్యాప్తంగా ఉన్న న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలన్నారు.

## శ్రీ విఘ్నేశ్వర యూత్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

ప్రొద్దుటూరు, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త:



ప్రొద్దుటూరు పురపాలక సంఘం పరిధిలోని 10వ వార్డులోని శ్రీరాముల పేట వీధిలో శ్రీ విఘ్నేశ్వర యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన రంగవల్లుల పోటీలలో 50మంది మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ ముగ్గుల పోటీలలో పాల్గొన్న మహిళలకు న్యాయ నిర్ణేతలుగా విచ్చేసిన మాజీ మున్సిపల్ చైర్మెన్ ఇరగం మల్లేశ్వరి, కపిలేశ్వర చిట్స్ డైరెక్టర్ సునీత, 10వ వార్డు టిడిపి మహిళా నాయకురాలు నల్లబోతుల పావణి ఆధ్వర్యంలో మొదటి బహుమతి ప్రసన్న, రెండో బహుమతి ప్రియాంక, మూడో బహుమతి జ్యోతిలను ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మహిళలు పెద్దఎత్తున పాల్గొని రంగవల్లుల పోటీలను విజయవంతం చేసినందుకు విఘ్నేశ్వర యూత్ ఆర్గనైజర్ నల్లబోతుల నాగరాజు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దుగ్గిరెడ్డి రఘునాధ రెడ్డి, చవ్వా శ్రీనివాసులు రెడ్డి, సి.కపిలేశ్వర నాయుడు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## సామాజిక తనిఖీ పక్కగా నిర్వహించాలి : ఎంపీడీఓ

పెనగలూరు, సెప్టంబర్11, ప్రభాతవవార్త :



సామాజిక తనిఖీ పక్కాగా నిర్వహించాలని మండల ఎంపీడీఓ వరప్రసాద్ తెలిపారు. బుధవారం మండలంలో ఎంపీడీఓ కార్యాలయంలో ఈ నెల 10వ తేదీ నుండి సామాజిక తనిఖీ బృందం ప్రజావేధిక నిర్వహించడం జరిగింది. ఈ ప్రజావేధికలో చదురు ముదురు ఘనటలు చోటు చేసుకున్నాయి. మండల వ్యాప్తంగా 2023-24వ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తనిఖీలు చేయడం జరిగింది. ఈ తనిఖీలో మండల వ్యాప్తంగా సుమారు రెండు లక్షల రూపాయల వరకు అవకతవకలు జరిగినట్లు తెలిపారు. సంబంధిత పీల్డ్ అసిస్టెంట్ల కు రికవరీ చేసే విధంగా వారికి తెలిపినట్లు ఎంపీడీఓ వరప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డిఏ అధికారులు, ఎఒ పద్మభూషన్ రెడ్డి, ఏపీఓ మురళి, ఈసి సుబ్బరాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## పాలిచ్చే తల్లులకు అవగాహన కార్యక్రమం



జమ్మలమడుగు, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:

మండలంలోని ఎత్తపువారి కాలనీలో సపూర్ణ ప్రోగ్రాంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రం వద్ద గర్భిణీలు, మరియు పాలిచ్చే తల్లులకు అవగాహన మరియు పోషకాహారపు ఆహారాల ప్రదర్శన నిర్వహించారు. ఈ సమావేశంలో సీడీపీవో రాజేశ్వరిదేవి, గర్భిణీలు మరియు పాలిచ్చే తల్లులకు వంద శాతం పోషకాహారం అందించడం ఎంత ముఖ్యమో ప్రస్తావించారు. ఇది మాతృ మరియు శిశు ఆరోగ్యానికి కీలక అంశమన్నారు. గర్భధారణ సమయంలో స్త్రీలు ప్రొటీన్, ఐరన్, కాల్షియం, ఫోలిక్ యాసిడ్ మరియు ఇతర విటమిన్లు, ఖనిజాల యొక్క అధిక స్థాయిలు అవసరమన్నారు. పాలిచ్చే తల్లులు బ్రెస్ట్ మిల్క్ ఉత్పత్తి కోసం అదనపు క్యాలరీలు మరియు పోషకాలు అవసరమన్నారు. అనంతరం వారికి ఆరోగ్య విషయాలపై తీసుకోవాల్సిన ఆహారపు అలవాట్లు, జాగ్రత్తలను వివిరంచారు. ఈ కార్యక్రమంలో ఆశావహ బ్లాక్ ఫెలో శ్రీకాంత్, సూపర్‌వైజర్ గౌసియా, అంగన్‌వాడీ కార్యకర్తలు రామలక్ష్మి, సుబ్బలక్ష్మి, గంగాదేవి, మాధవి, ముంతాజ్, మహిళా పోలీసు నాగలక్ష్మి, వినోలియా, ఏఎన్ఎంలు హన్నమ్మ, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

## ఒక రోజు రిలే నిరాహారదీక్ష

జమ్మలమడుగు, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:



జిల్లాలోని అన్ని డిపోలలో రీజనల్ కమిటీ పిలుపు మేరకు ఒక రోజు రిలే నిరాహారదీక్షలు ఏర్పాటు చేయడంతో గత 8 నెలలుగా డీపీటీవో జిల్లా వ్యాప్త సమస్యల గురించి అనేక సార్లు మౌఖికంగా, రాతపూర్వకంగా విజ్ఞప్తి చేసినా పట్టించుకోకపోవడంతో బుధవారం దీక్షలో ఎస్వీఎస్ రాయుడు, గంగాధర్, రంగయ్య, పీఎస్ వాసు తదితరులు దీక్షలో కూర్చున్నారు. ముఖ్య అతిథిగా రీజనల్ కార్యదర్శి సుధాకర్ విచ్చేసి ప్రసంగించారు. అలాగే డిపో ప్రెసిడెంట్ బ్రహ్మంగారు అధ్యక్షత వహించగా డిపో వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంజీసీవో రెడ్డి, డిపో కార్యదర్శి శివుడు, గ్యారేజీ కార్యదర్శి వలీ, సీసీఎస్ డిలికేట్ కాంతయ్య, ఎంజీ నాగేంద్ర శ్రీనివాసులు, ఎస్బీ వల్లీ, రామలింగారెడ్డి, రమణ, నీలకంఠయ్య, అధిక సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఇసుక పర్మిట్ కేంద్రాన్ని సబ్ కలెక్టర్ కార్యాలయానికి మార్పు

రాజంపేట అర్బన్, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త:

ఒక వైపు ఇసుక పర్మిట్లు జారీ చేయడంలో ఉన్నతాధికారుల నుంచి ఒత్తిళ్లు. మరోవైపు గుట్టుచప్పుడు కాకుండా పర్మిట్లు ఇవ్వాలని రాజకీయ నేతల డిమాండ్. ఇంకో వైపు మైనింగ్ అధికారులు తెరవెనుక నుంచి సచివాలయ సిబ్బందికి రహస్యంగా పనులు చేయాలని సంకేతాలు. వీటిన్నింటికి తోడు గత మూడు నెలలుగా ఇసుక లేకపోవడంతో విపరీతమైన డిమాండ్. ఫలితంగా సచివాలయ సిబ్బంది ఇసుక పర్మిట్లు జారీ చేసేందుకు విధులు నిర్వహించలేమని చేతులెత్తేశారు. దీంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రాజంపేట సబ్ కలెక్టర్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇసుక పర్మిట్లు జారీ చేసే కేంద్రాన్ని సబ్ కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలోకి మార్పు చేస్తూ ఆదేశాలు ఇచ్చారు. ఈ మేరకు సబ్ కలెక్టర్ వైఖోమ్ నైదియా దేవి బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. గురువారం నుంచి ఇసుక పర్మిట్లు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో జారీ చేస్తారని పేర్కొన్నారు. కాగా కూచివారిపల్లె సచివాలయంలో నాలుగు రోజుల పాటు విధులు నిర్వహించిన నలుగురు ఉద్యోగులు తాము ఈ పనిచేయలేమని ఎంపీడీఓను కలిసి లేఖ ఇచ్చినట్లు తెలిసింది. ఈ విశయం ఎంపీడీఓ ఉన్నతాధికారులకు సమాచారం అందించారని తెలిసింది. అందులో ముగ్గురు తిరిగి పనిచేసేందుకు తాత్కాలికంగా సమ్మతించినట్లు సమాచారం. వీరిని కూడ కొద్దిరోజుల పాటు మాత్రమే అనుమతించి ఆ తర్వాత వేరే ఉద్యోగులను నియమించనున్నట్లు సమాచారం. సామాన్య ప్రజలకు ఇసుక అందుబాటులో ఉంచేందుకు సబ్ కలెక్టర్ గట్టి నిర్ణయం తీసుకున్నారు. ఎవరైనా క్యూలో నిల్చోని పర్మిట్లు తీసుకునేలా విధి నిర్వహణ చేయాలని స్పష్టం చేశారు. అయితే మరోవైపు రాజకీయ పార్టీల నేతల నుంచి సచివాలయ ఉద్యోగులకు ఒత్తిడి రావడంతో వారు భరించలేకపోయారు. ఫలితంగానే విధులు నిర్వహించేందుకు విముఖత వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది.

## వైభవంగా వినాయక నిమజ్జనం

పెండ్లిమర్రి, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:



మడలంలోని పెండ్లిమర్రి చర్లపల్లి యాదవపురం తదితర గ్రామాల్లో బుధవారం వైభవంగా వినాయక స్వామి నిమజ్జనం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా రామాలయంలో కుంభాభిషేకం

## – టీఎన్ కుటుంబం ఆధ్వర్యంలో గణపతి హోమం

**తంబళ్లపల్లె, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:**



తంబళ్లపల్లె మండల కేంద్రం నడిబొడ్డులోని శ్రీ కోదండ రామాలయంలో బుధవారం టీఎన్ కుటుంబీకుల ఆధ్వర్యంలో సీతారాములకు కుంభాభిషేకం, సంప్రోక్షణ కార్యక్రమాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఉదయం టీఎన్ కుటుంబీకులు టి.ఎన్.హర్షవర్ధన్‌రెడ్డి, టీఎన్ విజయ నారాయణరెడ్డి, టీఎన్ ప్రమీలమ్మ, టీఎన్ దినకర్‌రెడ్డి, టీఎన్ శోభమ్మ, టీఎన్ అనుపమమ్మల ఆధ్వర్యంలో సీతారాములకు ప్రాత:పూజ, స్వామి వారి మూల విగ్రహాలకు పంచామృతాభిషేకం, శాంతిహోమం, మహా పూర్ణాహుతి కార్యక్రమాలు శ్రీబ్రహ్మశ్రీ జి.లక్ష్మణ స్వామి, ఆలయ అర్చకులు శ్రీనివాసులు స్వామి ఆధ్వర్యంలో వైభవోపేతంగా నిర్వహించారు. స్వామి వారికి మంగళహారతులు ఇచ్చి తీర్థ ప్రసాదాలు సమర్పించారు. ఈ కార్యక్రమానికి తంబళ్లపల్లె మండలం నుంచి వందలాదిగా భకక్తులు హాజరై శ్రీకోదండ రామస్వామి ఆలయంలో జరిగిన కుంభాభిషేకం, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలను కనులారా వీక్షించారు. అనంతరం స్వామి వారి మంగళహారతి, కర్పూర హారతి తీసుకొని ప్రసాదం, నైవేద్యం స్వీకరించారు.

# జాబ్ మేళాకు 21 మంది నిరుద్యోగ యువత ఎంపిక

**తంబళ్లపల్లె, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:**

తంబళ్లపల్లె మండల కేంద్రంలోని శ్రీ టీఎన్ వెంకట సుబ్బారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ ఐటీఐలో బుధవారం జాబ్ మేళాకు 21 మంది నిరుద్యోగ యువతీ యువకులు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ నాగరాజులు విలేకరులకు తెలిపారు. ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్ మరియు జిల్లా ఎంప్లాయిమెంట్ ఎక్ఛేంజ్ ఆధ్వర్యంలో 3 ప్రముఖ కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారు. 46 మందిలో 21 మందికి రూ.13వేల నుంచి రూ.25వవేల జీతంతో నియామక పత్రాలు అందజేశారు. ఈ జాబ్‌మేళాలో డీఈవో దోనప, ఏపీఎస్ఎస్‌డీసీ జిల్లా పీవో వెంకటేష్, కోఆర్డినేటర్ చౌడయ్య, ఐటీఐ అధ్యాపకులు, నిరుద్యోగ యువతీ యువకులు పాల్గొన్నారు.

# వైభవంగా గణేష్ నిమజ్జనం

**తంబళ్లపల్లె, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలో బుధవారం స్థానిక ప్రజలు, భక్తులు వినాయక నిజమ్జన కార్యక్రమాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. తంబళ్లపల్లె, పరసతోపు, జుంజురపెంట, ఆర్ఎన్ తాండా తదితర గ్రామాల్లో వందలాదిగా వినాయక విగ్రహాలు పెద్దేరు ప్రాజెక్టు, చిన్నేరు ప్రాజెక్టు, దబ్బలగుట్టపల్లి ప్రాజెక్టు తదితర చెరువుల్లో విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. గణేష్ యూత్ ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని ఎన్నడూ లేని విధంగా భారీ క్రేన్‌తో డీజే సిస్టం, వాయిద్య బృందాలు, భారీ బాణాసంచా పేలుళ్ల సమక్షంలో నిమజ్జనం చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పటిష్టబందోబస్తు నిర్వహించారు.

# అజంతా షూ కంపెనీ దినదినాభివృద్ధి చెందాలని ఆకాంక్ష

## – జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి

**కడప వైద్యవిభాగం, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:**

కడప నగరంలో ఏర్పాటైన అజంతా షూ కంపెనీ దినదినాభివృద్ధి చెంది విస్తారంగా విస్తరించాలని జిల్లా కలెక్టరు శివశంకర్ లోతేటి ఆకాంక్షించారు. బుధవారం స్థానిక మద్రాసు రోడ్డులోని గోకుల్ కాంప్లెక్సు నందు ఏర్పాటు చేసిన అజంతా షూ కంపెనీ ప్రారంభోత్సవానికి ఆయన హాజరై రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ కోరా గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఛైర్మన్ డా.కె.వెంకట చలపతి, సతీమణి విజయవాడ, చెన్నై సెంట్రల్ లెదర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ నందు లెదర్ ప్రాసెసింగ్ కెమికల్స్‌లో రీసెర్చ్ చేసి పీహెచ్‌డీ కూడా తీసుకొని నాయనమ్మ స్ఫూర్తితో అజంతా షూ కంపెనీ ఏర్పాటు చేయడం జరిగిందని అది దినదినాభివృద్ధి చెంది విస్తరించాలన్నారు. సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా సరసమైన ధరలకు అందించాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ ఇన్‌ఛార్జి కమిషనర్ రాకేష్ చంద్ర, కోరా గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఛైర్మన్ డా.వెంకట చలపతి, సతీమని విజయ, చీఫ్ సెక్రటరీ ప్రభాకర్‌రెడ్డి, ఎండీ కేవీ రమేష్, మేనేజింగ్ పార్ట్నర్ విజయ్, డైరెక్టర్ గోపీకృష్ణ, ప్రజాప్రతినిధి కందుల శకుంతల తదితరులు పాల్గొన్నారు.

# 90 ఫ్యాకెట్ల రేషన్‌బియ్యం పట్టివేత

**రాజుపాళెం, సెప్టంబర్11, ప్రభాతవార్త.**

మండల పరిదిలోని పలుగ్రామాలలో సేకరించిన 90ఫ్యాకెట్ల రేషన్‌బియ్యంను సీజ్‌చేసి, అక్రమంగా తరలిస్తున్నవాహనంను సేకరించిన చెరుకుచెర్ల వెంకటేశ్ అనే వ్యక్తిని బుదవారం యస్ఐ కత్తి వెంకటరమణ అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. ప్రొద్దుటూరు పట్టణంనకు చెందిన వెంకటేశ్ గ్రామాలలో సేకరించి అక్రమంగా తరలిస్తున్న సందర్బంగా అతనిని యస్ఐ అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

# నకిలీ లోన్ యాప్‌లను మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేయకండి

## – సైబర్ క్రైం టోల్‌ఫ్రీ నెంబరు 1903 సేవలు వినియోగించుకోవాలి

**కడప క్రైం, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:**




నకిలీ లోన్ యాప్‌లను మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేసుకోవద్దని అలాగే అపరచితులకు వ్యక్తిగత వివరాలు ఇవ్వకూడదని సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ మధుమల్లేశ్వర్‌రెడ్డి, ఎస్.తాజుద్దీన్‌లు తెలిపారు. జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు సూచించారు. బుధవారం ఎస్పీ ఆదేశాల మేరకు వారు 6వ కంబైన్డ్ యానువల్ ట్రైనింగ్ క్యాంప్‌లో పోలీసులు, విద్యార్థులతో మాట్లాడా రు. ఇటీవల కాలంలో ప్రపంచ మొత్తం సైబర్ క్రైం రూపంలోనే ఎక్కువ మోసాలు జరుగుతున్నాయని తమకు జరిగిన మోసాలు ఎలా చెప్పుకోవాలో అర్థం కాక బాధితులు లోలోనే మదనపడుతున్నారన్నారు. రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా మార్గదర్శకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి తర్ఫీదు చేసినప్పుడే సైబర్ నేరాలను నివారించగలుగుతామన్నారు. సైబర్ నేరం జరిగిన వెంటనే 1930 టోల్‌ఫ్రీ నెంబరు లేక సైబర్‌క్రైం.గో.ఇన్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి ఫిర్యాదు చేస్తే తక్షణమే స్పందించి బాధితులకు న్యాయం చేస్తామని తెలిపారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచనలు, సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరిస్తాం

## – మండల సమావేశంలో ఎమ్మెల్యే శ్రీధర్

**చిట్వేలి, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:**




మండల పరిధిలోని ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకై కృషి చేస్తామని ఎమ్మెల్యే అరవ శ్రీధర్ తెలిపారు. బుధవారం ఎంపీడీవో సభాభవనంలో జరిగిన మండల సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ గ్రామాలలో విద్యుత్తు, తాగునీరు, ఆరోగ్య, విద్య మరియు మౌలిక వసతుల సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు వెంటనే న్యాయం చేయాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వైద్య ఆరోగ్యసిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి ఫీవర్ సర్వే చేపట్టాలని తెలిపారు. పంచాయతీలలో పారిశుద్ధ్య పనులను చేపట్టాలన్నారు. తదుపరి వైద్యులు డా.అన్సారి మాట్లాడుతూ క్షయ వ్యాధి నివారించే బీసీజీ టీకాపై అపోహ వీడి అందరూ ఉపయోగించుకోవాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మురళీ మాట్లాడుతూ జలజీవన్ మిషన్ ద్వారా దాదాపుగా ప్రతి ఇంటికి తాగునీటిని అందించామన్నారు. ఉద్యానశాఖాధికారిని ఆసియా మాట్లాడుతూ ఆయిల్‌ఫామ్ సాగుతో అధిక ఆదాయం పొందవచ్చన్నారు. అరటి పంట ఈ క్రాప్ ద్వారా 60% నష్టపరిహారాన్ని పొందే అవకాశం రైతులకు ఉందన్నారు. ఉపాధి ఏపీవో చంద్రకళ మాట్లాడుతూ 16 రకాల ఉద్యాన పంటల సాగుకు ఉపాధిలో ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. వివిధ శాఖల అధికారులు తమ శాఖల పరిధిలో చేపట్టిన పనులను వివరించారు. కాగా రెవెన్యూ శాఖ, ఆర్‌అండ్‌బీ, ఫారెస్ట్, ఇరిగేషన్ తదితర శాఖల అధికారులు గైర్హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శివరాంరెడ్డి, ఎంపీపీ చంద్ర, ఉప ఎంపీపీలు చెవ్వు శ్రీనివాసులురెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, ఎల్వీ మోహన్‌రెడ్డి, ఉమామహేశ్వర్‌రెడ్డి, కూటమి నాయకులు రామాంజనేయులు నాయుడు, లారీ సుబ్బరాయుడు, నాగార్జున, నరసింహ, కాకర్ల నాగార్జున, కోఆప్షన్ సభ్యులు అన్సర్‌బాషా, ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా వినాయక నిమజ్జనం

**లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త:**



మండలంలోని ఐదు రోజులపా టు విశేష పూజలందుకున్న గణ నాథులను బుధవారం భక్తులు నిమజ్జనం చేశారు. ముందుగా పూజలు నిర్వహించి వాహనాల్లో వినాయకులను ఊరేగింపుగా తరలించారు. మరి చెట్టు, జిఎంఆర్ కాలనీ, నలందనగర్, కొండమం డ్లపల్లి పాలెం గొల్లపల్లి పర్వత రెడ్డి గారి పల్లె జిఎంఆర్ కాలనీ తదితర గ్రామాల్లో యువకులు రంగులు చల్లుకుంటూ సాంస్కృతిక కార్యక్రమాల వెంకటేష్ ఆధ్వర్యంలో కోలాటం చెక్కభజనలు మధ్య నిమజ్జనంలో పాల్గొన్నారు. స్వామివారికి నైవేధ్యంగా పెట్టిన లడ్డులను వేలంపాట నిర్వహించారు. డీఎస్పీ ఆదేశాల మేరకు సీఐ కొండారెడ్డి ఎస్సై రవీంద్ర పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు మహిళలు భక్తులు పాల్గొన్నారు.

# వైవిధ్యమైన ఫ్యాషన్ నగలు









దుస్తులూ,
యాక్సెసరీల్లోనే కాదు..
పసిడి నగల్లోనూ వైవిధ్యమైన ఫ్యాషన్లను
కోరుకుంటోంది ఈ తరం. అందుకే, ఇప్పుడు ఆభరణాలన్నీ
ఆధునిక సొగసుద్దుకుని మరీ వారిని ఆకట్టుకుంటున్నాయి.
అలాంటి వాటిల్లో ఎసెమిట్రికల్ స్టైల్ ఒకటి. నిన్నమొన్నటివరకూ
సాధారణంగా డ్రెస్‌ల్లో కనిపించినఈ డిజైన్ ఇప్పుడు జ్యూయెలరీకి
నిండుదనం తెస్తోంది. పాశ్చాత్యశైలినితలపిస్తూ సంప్రదాయ సౌందర్యాన్ని
మరింత
అందంగా ఇనుమడింపజేస్తోంది. ఎసిమెట్రికల్ ప్యాటర్న్ అంటే. నగ
అంతా ఒకే తీరున ఉండకపోవడమే ! రెండు డిజైన్లను ఒకే ఆభరణంలో
కలగలిపో, లేదంటే ఒక వైపున కాస్త పెద్దగా, మరోవైపున చిన్నగా
ఉండేలా తీర్చిదిద్దడమో, ఇవేవీ కావంటే పెండెంట్ మధ్యకి
కాకుండా కాస్త పక్కగా ఏర్పాటు చేయడమో! ఏది ఏమైనా
ఈ తరహా నగలు.. ధరించినవారికి కొత్తదనాన్ని
తెచ్చిపెట్టడమే కాదు చూసేవాళ్లందరినీ
అయస్కాంతంలా ఆకట్టుకుంటున్నాయి.
వాటిని మీరూ ఓ సారి









# పుస్తక పఠనం మంచిదే ..

కొంతమంది పిల్లలు గట్టిగా బయటకు చదివితే నెమ్మదిగా చదవలేవా అంటూ తిడుతుంటాం. కానీ ఇలా పుస్తక పఠనం చేయడం వల్ల కొన్ని ప్రయోజనాలు ఉన్నాయంటున్నారు. నిపుణులు. అవేంటంటే..

- పిల్లలు పుస్తకంలో పదాలను గుర్తిస్తూ బయటకు చదివేటప్పుడు వాటిని గుర్తుంచుకోవడానికి ప్రయత్నిస్తారు. అంతేకాదు విషయాన్ని సులభంగా గ్రహించగలుగుతారు. ఇది వారిలో జ్ఞాపకశక్తి పెంచుతుంది.
- విని నేర్చుకునే వారిని ఆడియో లెర్నర్స్ అంటారు. ఇలాంటివారు దేన్నైనా శ్రద్ధంగా వినడానికి ప్రయత్నిస్తారు. వారిలో భాషానైపుణ్యం మెరుగుపడి చిన్నతనం నుంచే ఉచ్చారణ అలవాటు అవుతుంది. పదాలు సులభంగా నేర్చుకుంటారు.



- చాలామంది పిల్లలకు చదవమంటే చిరాకు వస్తుంది. అదే గట్టి చదువు అంటే మాత్రం ఎంతో హుషారుగా ఉంటారు. దీని వల్ల వారిలో ఉన్న ఒత్తిడి, ఆందోళనలు దూరం అవుతాయని అంటూన్నారు. □

**చెలి చిట్కా**

వామును నీళ్ళలో నానబెట్టి ఆ నీటిలో కొద్దిగా ఉప్పు కలిపి తాగితే వాంతులు తగ్గుతాయి. □

# ఇంజినీరే జీవితం కాదు !



**ఎన్.బి.సుధాకర్‌రెడ్డి**
**సైకాలజిస్టు**

**ప్రశ్న :** మేము పేద వారము. పిల్లల్ని ప్రైవేటు స్కూళ్ళు, కాలేజీలలో చదివించే స్తోమత లేదు. మాకు ఒక అమ్మాయి, అబ్బాయి ఉన్నారు. అమ్మాయి పదవతరగతి పాస్ అయ్యింది. ప్రభుత్వ పాఠశాలలో చదవడం వల్ల మంచి మార్కులు తెచ్చుకోలేకపోయింది. దీనితో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సైన్స్ గ్రూపులో సీటురాలేదు. ఎలాగైనా డాక్టరు లేక ఇంజినీరు కావాలని కోరుకుంటున్నది. అయితే ఆఖరికి హెచ్.ఇ.పి గ్రూపులో సీటు వచ్చింది. అతి కష్టం మీద హాస్టల్లో కూడా సీట్లు వచ్చింది. అయితే అమ్మాయి చాలా బాధపడుతున్నది ప్రైవేటు జూనియర్ కళాశాలలో కనీసం ఎంపిసి గ్రూపులో చేరి ఇంజనీరైనా కావాలంటోంది. మాకు ఆశక్తి లేదంటే ఏడుస్తోంది. తన కర్మఖాలి మాలాంటి పేదవారికి పుట్టాను అంటోంది. ఆమె లెక్కలు, సైన్స్‌లో కొంత వెనుకబడింది. సాంఘిక శాస్త్రంలోమంచిమార్కులు వచ్చాయి. ఆమె కోరినట్టు ప్రైవేటు కాలేజీలో చేర్పించలేము. ఆర్ట్స్ గ్రూపు చదివి గుమాస్తా ఉద్యోగం చేయడం కంటే మా వృత్తి చేయడమే మేలాటోంది. తన స్నేహితులు కొందరు మంచి కాలేజీల్లో చేరారు. వారితో పోల్చుకుని బాధపడుతున్నది. కనీసం తన తమ్ముడిని అయినా మంచి పాఠశాల, కాలేజీలో చదివించమంటోంది. ఆమె మాటలు వింటే ఆస్తి మూరడు ఆశ బారెడు అన్న సామెత గుర్తుకు వస్తోంది. నేను నా భర్త పదవ తరగతి వరకు చదువుకున్నాము. అయినా ఆర్ట్స్ గ్రూపులు చదివి చాలా గొప్పవారైన వారిని గూర్చి తెలుసు. ఆ మాట చెప్పితే ఆమె వినడం లేదు. చేతకాక సామెతలు చెప్పడం ఎందుకు అంటూ ఈసరించ కుంటోంది. ఈ దశలో ఆమెలో ప్రేరణ కలిగించే మార్గం చెప్పండి.

**- ఒక సోదరి, చిత్తూరు జిల్లా**



**జవాబు :** అమ్మా మీ సమస్య అర్థం అయింది. చాలా మంది విద్యార్థులు, యువకులు ఆలోచనా విధానాలలో లోపం ఉంది. ఆశమూరెడు అర్హత చిత్తేడు అన్నట్లు మాట్లాడుతుంటారు. పోటీ ప్రపంచంలో రాణించేందుకు నిరంతరం కృషి చేయక తప్పదు. ప్రభుత్వ పాఠశాలలో చదివితే మార్కులు రావు అన్నది నిజం కాదు. నిజానికి ప్రైవేటు పాఠశాలలకంటే ప్రభుత్వ పాఠశాలల్లో పని చేసే ఉపాధ్యాయులకే ఎక్కువ విద్యార్హతలు ఉంటాయి. అతి కొద్ది మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు నిర్లక్ష్యంగా ఉండవచ్చు నేమో కానీ అందరూ బాగానే చెపుతుంటారు. అయితే విద్యార్థుల్లో శ్రద్ధ, కృషి, తెలివితేటలు నైపుణ్యాల లోపంవల్ల చదువులో వెనకబడుతుంటారు. కొందరు కొన్ని సబ్జెక్టుల్లో రాణించి, కొన్నింటిలో వెనకబడుతుంటారు. అలాంటి వారిని తల్లిదండ్రులు ఉపాధ్యాయులు గుర్తించి సరిదిద్దాలి,. అలాగే విద్యార్థులు కూడా స్వయంప్రేరణతో లోపాలను అధిగమించే ప్రయత్నం చేయాలి. అయితే సహజ సిద్ధంగా ఉన్న తెలివి తేటలు, నైపుణ్యాలకు అనుగుణంగా కోర్సులు ఎంచుకోవడం మంచి పద్ధతి మన సమాజంలో డాక్టరు, ఇంజినీరు వృతుల పట్ల ఎక్కువ మోజు ఉంది. మిగిలిన వృత్తులను గూర్చి ఆలోచించడం మానేశారు. ఉదాహరణకు సుప్రీంకోర్టులో కొందరు సీనియర్ లాయర్లు ఒక గంట వాదించేందుకు 20 లక్షలకుపైగా తీసుకుంటారు మల్టీనేషనల్ కంపెనీలలో కీలక బాధ్యతలు నిర్వహించే వారు డాక్టర్లు, ఇంజనీరు కంటే ఎక్కువ సంపాదిస్తున్నారు. ఐఎఎస్ , ఐపిఎస్ చదివిన వారు సమాజం ఉన్నత స్థాయి వ్యక్తులుగా ఉన్నారు. వీరంతా ఆర్ట్ గ్రూపు చదివిన వారే అన్నది గుర్తుపెట్టుకోవాలి. అతికొద్ది మంది సైన్స్ చదివి ఇతర వృత్తులు చేపట్టేవారు ఉన్నారు. కాబట్టి ఇంజినీరు మాత్రమే గొప్ప కాదన్న అవగాహన కల్పించండి

**వృథ**

# పిచ్చి బఠాణీలు.. మెచ్చు గుణాలు



**తాజా బఠాణీలు..** ఆకుపచ్చ ముత్యాల్లా ఎంత అందంగా ఉంటాయి కదూ! చూస్తుంటేనే నోట్లో వేసుకోబుద్దేస్తుంది. బఠాణీలను క్యాలీఫ్లవర్, క్యాబేజ్, బంగాళదుంప, క్యారెట్.. ఇలా దేనితో కలిపి వండినా వాటి రుచి రెట్టింపవుతుంది. బిర్యానీ, కిచిడీల్లో ఇవి గనుక లేకపోతే.. పెద్ద లోటుగానే ఉంటుంది. వీటితో స్వీట్లు, హాట్లు కూడా చేయొచ్చు. సూప్, సలాడ్ రూపంలోనూ సేవించవచ్చు. బఠాణీల్లో ఎన్ని సుగుణాలున్నాయంటే.. ఇవి.. పచ్చిబఠాణీలు ఎర్రరక్త కణాలు వృద్ధిచెందడంలో, శరీరం అంతటికీ ప్రాణవాయువును అందజేయడంలో తోడ్పడతాయి. రక్తంలో చక్కెర స్థాయిని క్రమబద్ధం చేస్తాయి. బఠాణీలు తినడం వల్ల జీర్ణ వ్యవస్థ మెరుగుపడుతుంది. తరచుగా బఠాణీలు తినేవారికి క్యాన్సర్ వచ్చే అవకాశం తక్కువ. వీటిలో ఉన్న సెపోనిన్స్ ద్రవ్యాలు క్యాన్సర్ చేరిన సూక్ష్మ క్రిములను నశింపచేస్తాయి. వీటిల్లో ఉండే కెరోటినాయిడ్స్, జిక్సాందౌథిన్లు కళ్లకు దీర్ఘకాలిక వ్యాధులు రాకుండా కాపాడతాయి. యాంటీఇన్‌ఫ్లమేటరీ గుణాలు రోగనిరోధక శక్తిని పెంచుతాయి. మధుమేహం, ఉబకాయం, గుండెజబ్బుల నుంచి ఉపశమనం కలిగిస్తాయి. ఇవి కొన్ని రకాల క్యాన్సర్లను సైతం నిరోధిస్తాయని పరిశోధనల్లో తేలింది. పీచు, పొటాషియం, ప్రొటీన్లు ఉన్నాయి. మాంసాహారం తినని వాళ్లకి మంచి పోషకాహారం. ఇంత మేలు చేసే బఠాణీలను విస్మరిస్తే ఎలా! తరచూ ఏదో రూపంలో తీసుకుందాం. ఆరోగ్యంగా ఉందాం కానీ అవసరమైన దాని కంటే ఎక్కువగా తింటే మాత్రం అనర్థమేనండోయ్. □

# చోఖామేళా



సాయిబాబా **షిరిడీకి వచ్చినప్పుడు** ఖండేరావు గుడిలోనికి పోబోతుంటే, ఆ ఆలయ పూజారి మహల్సాపతి వారించాడు. సాయిబాబా అప్పుడు కోపం తెచ్చుకోకుండా.. నీ అభిమతాన్ని అనుసరించి నేను దూరం నుండే దర్శనం చేసుకుంటాలే! దానికి అభ్యంతరం లేదనుకుటాను. మీ పురాణాలలో ఒక కథ ఉన్నది. పంచముడైన చోఖామేళా పాండురంగనికి ప్రియమైనవాడు. పాండురంగని వద్ద పూజ చేసే పురోహితులకంటే వంద రెట్లు శ్రేష్ఠుడు. శ్రీహరి ద్వారాన్ని చేరుటకు శ్రద్ధతో ప్రయత్నంచేసేవారు తప్ప మిగిలిన అందరూ పంచములే! ఎవరి ఆంతర్యం పరిశుద్ధంగా ఉంటుందో, వాడు సర్వత్ర పరిశుద్ధుడే! అన్నాడు. మహారాష్ట్రలో చోఖామేళాను గూర్చి తెలియని వారుండరు. అతనిని పాండురంగని ఆలయంలోపలకు రానీయలేదు. కానీ అంతటా పాండురంగని చూచి మైమరచిపోయే భక్తుడు. ఒకనాడు ఒక గోడను కడుతూండగా, అది కూలటం వలన చోఖామేళా, మరి కొందరు మరణించారు. శవాలను తీయటానికి చాలా సమయం పట్టింది. సామూహిక దహనం చేశారు. నామదేవునితో పాండురంగడు 'నా భక్తుడు చోఖామేళా అతని సమాధి నా మందిరమునకు ఎదురుగా ఉండాలనే ఒకే ఒక్క కోరికతో జీవించాడు. ఆ కోర్కె తీర్చుట నా లక్ష్యం' అన్నాడు. చోఖామేళా ఎముకలను గుర్తించటం సాధ్యం కాదుకదా? అన్నాడు నామదేవు. పాండురంగడు చోఖామేళుని ఎముకలు సహితం నా నామాన్ని ఉచ్చరిస్తాయి అన్నాడు. నాదేవుడు ఆ ఎముకల గుట్ట దగ్గరకు వెళ్లి, ఒకొక్క ఎముకను చెవి దగ్గర పెట్టుకొని, ఏవి అయితే పాండురంగని నాకు స్మరణ చేసినవో, వాటిని ఏరి తీసుకువచ్చి, పాండురంగని ఆలయమునకు ఎదురుగా చోఖామేళా సమాధిని నిర్మించాడు. చోఖామేళుని ఎముకలు రంగని నామాన్ని ఉచ్చరిస్తాయి. చోఖామేళుడు వైశాఖ బహుళ పంచమినాడు (మే నెల) దేహాన్ని త్యజించాడు. సాయిదేహాన్ని త్యజించాడు. మహా సమాధిని నిర్మించాడు. బొంబాయి నివాసి యగు శ్రీమతి రుస్తుంజీ బాబా మహా సమాధిపై శిరమునుంచి బాబా నీవు జీవించి ఉన్నప్పుడు నా కష్టాలను కడతేర్చి నన్ను రక్షించినావు, ఇప్పుడు నాకు దిక్కెవ్వరు? అని రోదించగా ఆమెకు సమాధి నుండి రుస్తుంబేటా కబ్ ఆయా? అన్న మాటలు మూడుసార్లు వినిపించినవి. సాయి బాబా అంటారు నా ఎముకలు సహితము భక్తులతో మాట్లాడును.

**- యం.పి.సాయినాథ్**



ఆధ్యాత్మికం

# వరద బాధితులకు సరుకులు సిద్ధం : ఎమ్మెల్యే



మదనపల్లె, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త :
విజయవాడ వరద బాధితులకు నిత్యవసర సరుకులు సిద్ధం చేసినట్లు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సుమారు రూ.25లక్షల విలువైన నిత్యవసర సరుకులు సిద్ధంచేసి టౌన్‌హాలులో ఉంచడం జరిగిందన్నారు. ప్రత్యేక వాహనాల ద్వారా తరలించి వరద బాధితులకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. పట్టణంలోని పలు పురప్రముఖులు, మహిళా సంఘాలు, టిడిపి నాయకులు విరాళంగా అందజేయడం జరిగిందన్నారు. ముఖ్యంగా డబ్బుతో పాటు బియ్యం, రవ్వ, పసుపు, ధనియాలు, మెరపపొడి, పామాయిల్, కందిపప్పు, ఎర్రగడ్డలు వరద బాధితుల కోసం సేకరించడం జరిగిందన్నారు. బాధితులకు కిట్లు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నాదేళ్ళ విద్యాసాగర్, కౌన్సిలర్ గాంధీ, గుర్రప్పనాయుడు, బాబునాయుడు, సంఘం శీనా, ఆర్‌కె.రామక్రిష్ణ, ఎర్రబల్లి వెంకటరమణారెడ్డి, జేసిబి వేణు, మధు, ఈశ్వర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు. వరద బాధితులకు సిద్ధం చేసిన నిత్యవసర సరుకులను సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్, డిఎస్‌పి కొండయ్య నాయుడులు పరిశీలించారు.

## ఆర్టీసి గ్యారేజ్ సిబ్బందికి మేనేజర్ అభినందనలు

మదనపల్లె, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త :
ఆర్టీసి వన్‌డిపో ప్రాంగణంలో బుధవారం గేట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ ఎం.వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ మంగళవారం వరకు ఈపికే-37-48తో, ఓఆర్ 69శాతంతో మదనపల్లె ఆర్టీసి వన్‌డిపో రీజియన్‌లోనే మొదటిస్థానం వచ్చిందన్నారు. కెఎంపిఎల్‌లో 5.36తో రీజియన్‌లో రెండవ స్థానం వచ్చిందన్నారు. ఈ సందర్భంగా ఆయన ట్రాఫిక్ సిబ్బంది, గ్యారేజ్ సిబ్బందిని అభినందించారు. ఇదే వరవడితో ఉద్యోగులు అందరూ కష్టపడి ఆర్టీసిని లాభాల్లో నడిపించాలన్నారు.

## వినాయక నిమజ్జనంలో ఉట్లుతో కోలాహాలంగా చిన్నారులు

రామసముద్రం, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త :



రామసముద్రం మండలంలోని పలు గ్రామీణ ప్రాంతాల్లో వినాయక నిమజ్జనం ఘనంగా జరిగింది. వినాయక చవితి పండగ అయిన సందర్బంగా మండలంలోని గంపనపల్లె, దాసార్లపల్లె, ఊటుగొల్లపల్లెల్లో అంగరంగ వైభవంగా బొజ్జగణపయ్యకు నిమజ్జనం జరిగింది. వినాయకుని నిమజ్జనంలో ఎలాంటి ఘటనలు జరగకుండా పోలీసులు గట్టి పోలీస్‌బందోబస్తు నిర్వహించారు. చెరువులో వినాయకుని నిమజ్జనం ప్రశాంతంగా జరిగింది. నిమజ్జనం సందర్బంగా భక్తులకు అన్నదానం నిర్వహించారు. వినాయకస్వామి కేరళ వాయిద్యాల మద్య గొప్ప ఊరేగింపు యువకులు మహిళలు, రంగులు చల్లుకొని సంతోషంగా వినాయకుని నిమజ్జనం చేశారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలుజరగకుండా ఎస్ఐ చంద్రశేఖర్ గట్టిబందోబస్తు నిర్వహించారు. అనంతరం చెరువుల వద్దకు తీసుకెళ్లి వినాయక విగ్రహాలు నిమజ్జనం చేశారు.

## ఒంటెద్దు పోకడ వల్ల కార్మికులు పస్తులు ఉంటున్నారు

మదనపల్లె, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త :




మదనపల్లె ప్రభుత్వ సర్వజన బోధనా ఆసుపత్రిలో గత 18ఏళ్ళుగా పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ కార్మికులకు నెలల తరబడి జీతాలు ఇవ్వడం లేదని సిపిఐ రాష్ట్ర సమితీ సభ్యులు క్రిష్ణప్ప ఆద్వర్యంలో నిరసన తెలిపారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని ప్రభుత్వ సర్వజన భోధన ఆసుపత్రిలో పనిచేస్తున్న సిబ్బందికి పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలంటూ గత కొన్ని రోజులుగా నిరసన తెలియజేస్తున్నా సంబంధిత అదికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. పెండింగ్‌లో ఉన్న జీతాలు చెల్లించాలని, అధికారులు నిర్లక్ష్యం నసించాలంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. నిరసన చేస్తున్నా సంబంధింత అధికారులు మాత్రం ఏమాత్రం పట్టించుకోవడం లేదని తెలిపారు. సంబంధిత మెడికల్ అధికారులతో సంప్రదింపులు జరిపి తక్షణమే పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని కోరారు. మెడికల్ సూపరిండెంట్ ఒంటెద్దు పోకడ వల్ల కార్మికులు పస్తులు ఉండాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి నాయకులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి క్రిష్ణప్ప, ఏఐటియుసి మదనపల్లె పట్టణ కార్యదర్శి తిరుమల, నాయకులు మురళి, జమీల్, అప్సానా, తులసి, మృదుల, ఉష, చంద్రిక, గంగాదేవి, రేవతి తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ సిఐగా లక్ష్మీనారాయణ



మదనపల్లె, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త :
మదనపల్లె ట్రాఫిక్ సిఐగా లక్ష్మీనారాయణ బుధవారం ఉదయం బాధ్యతలు చేపట్టారు. ఈసందర్బంగా నూతన సిఐ విలేకర్లతో మాట్లాడుతూ పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్దీకరణ చేపట్టి ప్రజలకు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూస్తానన్నారు. అలాగే వాహనాలకు సైలెన్సర్లు తొలగించి పెద్ద పెద్ద శబ్దాలతో నడిపే వారిని గుర్తించి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పట్టణంలో ట్రాఫిక్ అధికంగా ఉండే ప్రాంతాల్లో వన్‌వే అమలు చేస్తామన్నారు.

## విషం తాగి రైతు ఆత్మహత్యాయత్నం

నిమ్మనపల్లె, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త :



విషంతాగి రైతు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ ఘటన బుధవారం నిమ్మనపల్లె మండలంలో జరిగింది. ఎస్ఐ తిప్పేస్వామి కథనం మండలంలోని చల్లావాండ్లపల్లెకు చెందిన రైతు చంద్రశేఖర్(46)ను దాయాదులు దారికోసం కొంత కాలంగా ఇబ్బంది పెడుతున్నారని అధికారులను కోరినా న్యాయం జరగలేదు. దీంతో తీవ్ర మనస్థాపం చెందాడు. పొలం వద్దే విషం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా, కుటుంబీకులు మదనపల్లెకు తరలించి చికిత్సలు పొందుతున్నాడు.

## జై..భోలో గణపతి మహరాజ్‌కే..జై

కురబలకోట, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త :



కురబలకోట మండలంలోని పలు గ్రామీణ ప్రాంతాల్లో వినాయక నిమజ్జనం ఘనంగా జరిగింది. వినాయక నిమజ్జనం కురబలకోట మండలంలోని చేనేత నగర్‌లో మహాత్మజ్యోతిరావుపూలే గురుకుల పాఠశాల నందు అంగరంగ వైభవంగా బొజ్జగణపయ్యకు నిమజ్జనం జరిగింది. యువత ఉట్లుకొట్టి రంగులు చల్లుకొన్నారు. వినాయకుని నిమజ్జనంలో విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు. వినాయకుని లడ్డూ వేలం పాట పాడి రూ.20,116లు పాడుకొని బుర్ర విశ్వనాథ్ దక్కించుకొన్నాడు. ఈ నిమజ్జనంలో ఎలాంటి ఘటనలు జరగకుండా పోలీసులు గట్టి పోలీస్‌బందోబస్తు నిర్వహించారు. చెరువులో వినాయకుని నిమజ్జనం ప్రశాంతంగా జరిగింది. నిమజ్జనం సందర్బంగా భక్తులకు అన్నదానం నిర్వహించారు. వినాయకస్వామి కేరళ వాయిద్యాల మద్య గొప్ప ఊరేగింపు యువకులు మహిళలు, రంగులు చల్లుకొని సంతోషంగా వినాయకుని నిమజ్జనం చేశారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలుజరగకుండా ఎస్ఐ గట్టిబందోబస్తు నిర్వహించారు. అనంతరం చెరువుల వద్దకు తీసుకెళ్లి వినాయక విగ్రహాలు నిమజ్జనం చేశారు.

## నిమ్మనపల్లె ఎస్ఐని మర్యాదపూర్వకంగా కలిసిన మాణిక్యం

నిమ్మనపల్లె, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త :



నిమ్మనపల్లె మండల ఎస్ఐ తిప్పేస్వామిని బుధవారం మండల ఎంఆర్‌పిఎస్ అధ్యక్షులు వీరనాల మాణిక్యం మర్యాదపూర్వకంగా కలిసి ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువకప్పి సన్మానం చేశారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అసాంఘీక కార్యకలపాలు, బెట్టింగ్‌రాయుళ్లు, పేకాటరాయుళ్ళుపై చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. ఇందుకు ఎస్ఐ తప్పకుండా చర్యలు తీసుకుంటానని తెలిపారు. మాణిక్యంతో పాటు ఉపాధ్యాయులు బేతాని సుధాకర్, జయకుమార్, పాస్టర్ వెంకటరమణ, భరత్, ఆది తదితరులు పాల్గొన్నారు.

## దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేసిన అమీర్‌బాబు

కడప వైద్యవిభాగం, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:



మద్దిమడుగులో ఉన్న సయ్యద్‌షా బాబా నూరు అలీ దర్గాలో బుధవారం తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఎస్.అమీర్‌బాబు ప్రత్యేక ప్రార్థనలు చేసి స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ ఎంతో భక్తిశ్రద్ధలతో కుల, మతాలకు అతీతంగా ఈ దర్గాను దర్శించుకొని ఆ దేవుని ఆశీస్సులు పొందాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ ప్రధాన కార్యదర్శి నాసర్ అలీ, రాయల్ కరీముల్లా, దర్గా పీఠాధిపతులు, మత పెద్దలు, ముస్లిం మైనార్టీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అన్నదానం గొప్ప పుణ్య కార్యం

సుండుపల్లె, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:



వినాయకుని వారోత్స వాలను పురస్కరించుకొని బుధవారం మధ్యాహ్నం రాజంపేట నియోజకవర్గం, సుండుపల్లి మండలం, రాయవరం కస్పాలో వినాయకుని విగ్రహం దగ్గర గ్రామస్థులు ఏర్పాటు చేసిన పూజ మరియు అన్నదాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వినాయకుని విగ్రహం వద్ద అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు. రాయవరం వినాయక ఉత్సవ కమిటీ వారు సుబ్రమణ్యంను ఘనంగా స్వాగతం పలికి శాలువా గజమాలతో సత్కరించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సుండుపల్లె మండల తెదేపా, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, భక్తులు, గ్రామస్థులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఏఓ

రామసముద్రం, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త :



మండల కేంద్రంలోని ఎరువులు దుకాణాలను మదనపల్లె సహాయ వ్యవసాయ సంచాలకులు శంకర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎరువులు, యూరియాని ఎంఆర్‌పి ధరలకే అమ్మాలని, అధిక ధరలకు విక్రయించరాదని తెలిపారు. ప్రతి దుకాణంలో ధరల పట్టికను నోటీస్ బోర్డులో రాయాలన్నారు. ఎరువులను తీసుకొన్న ప్రతి రైతుకు బిల్లు ఇవ్వాలన్నారు. రైతు సేవా కేంద్రాల్లో యూరియా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ తనిఖీల్లో ఆయనతో పాటు వ్యవసాయ సంచాలకులు శంకర్, మండల వ్యవసాయ అధికారి మోహన్‌కుమార్ పాల్గొన్నారు.

## కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్యాయత్నం

మదనపల్లె, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త :



కుటుంబ కలహాలతో ఓ వివాహిత విషం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్ తెలిపారు. మండలంలోని యనమలవారిపల్లెకు చెందిన రెడ్డిశేఖర్ భార్య వసంత(24) కుటుంబ సమస్యల విషయమై భర్తతో గొడవపడి మనస్థాపానికి గురైంది. దీంతో ఇంటిలో ఉన్న పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా, కుటుంబీకులు గమనించి మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి అవ్యవసర విభాగం డాక్టర్లు పరీక్షించి మెరుగైన వైద్యం అందించారు. కేసు దర్యాప్తులో ఉంది.

## ఓపెన్ స్కూల్ ప్రవేశం కోసం ధరఖాస్తు చేసుకోవాలి

వీరబల్లి, సెప్టంబర్ 11, ప్రభాతవవార్త :
మండలంలోని విద్యార్థులు పదో తరగతి మరియు ఇంటర్‌మీడియట్ చదవకుండా ఆపివేసిన విద్యార్థులకు తిరిగి చదువుకునే ఆవకాశం ఎపెన్ స్కూల్ ద్వారా పొంద వచ్చని ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ పల్లం రామచంద్ర తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఆ నెల 15వ తేదీ లోపు ధరఖాస్తు చేసుకోవాలన్నారు. రూ.200 లు రుసుముతో ఈ నెల 25వ తేదీ లోపు ధకఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని మండలంలోని విద్యార్థులు సద్వినియెగం చేసుకోవాలని ఆయన తెలిపారు. ఓపెన్ స్కూల్ విద్యార్థులకు వీరబల్లిలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తరగతులు నిర్వహించబడునని తెలిపారు. మరిన్ని వివరాలు కోసం వీరబల్లి ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులుగా పని చేస్తున్న కోఆర్డినేటర్ పల్లం రామచంద్ర ను కలవాలన్నారు.

## ఘనంగా వినాయక నిమజ్జనం

వీరబల్లి,సెప్టంబర్11,ప్రభాతవవార్త :
మండల కేంద్రంలోని కొత్తపేట వినాయక చవితి సందర్బంగా వినాయక విగ్రహాన్ని నిలబెట్టడం జరిగింది. ఐదవ రోజు కావడంతో వినాయకుని నిమజ్జనం కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. గత ఐదు రోజులుగా స్వామి వారికి పూజలు, అభిషేకాలు, నిర్వహించారు. ఐదవ రోజున దేవనికి ప్రత్యేక పూజలు చేసి అన్న ప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం సాయంకాలం స్వామి వారిని ఉరంతా ఉరేగించి అనంతరం నిమజ్జనానాకి తీసుకెళ్లారు.

## అంటువ్యాధుల నిర్మూలనే ధ్యేయం

పీలేరు, సెప్టెంబరు 11 ప్రభాతవార్తః



గ్రామాల్లో సీజినల్ వ్యాధుల నియంత్రణకై ప్రతి ఒక్కరు బాధ్యత వహిద్దామని తలపుల పీహెచ్‌సీ వైద్యాధికారి చంద్రశేఖర్, సిబ్బందికి తెలిపారు. బుధవారం తలపుల పీహెచ్‌సీలో నిర్వహించిన సమావేశంలో సీజినల్ వ్యాధులు నియంత్రణకై అమలు చేయు పనితీరు గుర్చి వివరించారు. దోమల ద్వారా, కలుషిత నీరు, ఆహారంవల్ల సంక్రమించే అంటువ్యాధుల వల్ల జరిగే జ్వర బాధితులను ఎప్పటికప్పుడు గుర్తించి పరీక్షించి చికిత్సలు అందించడమే లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈ కొండయ్య, ఎంపీ హెచ్ఈఓ శ్రీనివాసులు, పర్యవేక్షకులు కష్ణయ్య, కుసుమ, ఏఎన్ఎంలు, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణలను గుర్తించి చర్యలు తీసుకోవాలి

పీలేరు, సెప్టెంబరు 11 ప్రభాతవార్తః



మేజర్ పంచాయతీ పరిధిలో అక్రమ నిర్మాణాలను, ఆక్రమణలకు గురైన పంచాయతీ భూములను, పంచాయతీ అధికారులు గుర్తించి వాటిని తొలగించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి టీఎల్ వెంకటేష్ పంచాయతీ అధికారులను డిమాండు చేశారు. బుధవారం పంచాయతీ ఈఓ గురుమోహన్‌ను ఏఐటీయూసీ, సీపీఐ నాయకులు కలిసి పంచాయతీలో పలుసమస్యలపై మాట్లాడుతూ గతంలో 49 మంది కాంట్రాక్టు కార్మికులలో కొంతమందిని ప్రజా ప్రతినిధులు వారి స్వలాభం కోసం ఉపయోగించుకున్నారని వారికి పంచాయతీ నుంచి జీతాలు చెల్లించారని అలాంటివి పునరావతం కాకుండా అరికట్టాలని కోరారు. కాంట్రాక్టు కార్మికులను పర్మినెంటుచేసి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. పంచాయతీ పరిధిలో అక్రమంగా పంచాయతీ నిబంధనలకు విరుద్దంగా నిర్మించిన నిర్మాణాలను తొలగించాలని కోరారు. కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని డిమాండు చేశారు. పంచాయతీలో జరిగిన అభివద్దికి ఖర్చు చేసిన నిధులలో అవినీతి జరిగిందని గతంలో ఉన్న పంచాయతీ అధికారిని సస్పెండ్ చేశారని, కానీ అవినీతి పంచాయతీ నిధులు రికవరీ ఎందుకు చేయలేదో పీలేరు ప్రజలుకు సమాధానం చెప్పాలని డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు పాల్గొన్నారు.

## ఘనంగా గణేష్ నిమజ్జనం

పీలేరు, సెప్టెంబరు 11 ప్రభాతవార్తః
నియోజకవర్గంలోని వాల్మీకిపురం మండలంలోని గండబోయనపల్లెలో గణేష్ నిమజ్జన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఉత్సవ కమిటీ నిర్వాహకులు పులి సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ గ్రామంలో అందరి సహకారంతో వినాయకచవితి సందర్భంగా విద్య నాయకుడికి అంగరంగ వైభవంగా పూజా కార్యక్రమాలు భక్తి శ్రద్దలతో నిర్వహించామన్నారు. భక్తులందరూ స్వామివారిని దర్శించుకుని అనుగ్రహం పొందాలని తెలిపారు. అత్యంత భక్తిశ్రద్దలతో బుధవారం వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈసందర్భంగా నిమజ్జన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నల్లారి బ్రదర్స్ వీరాభిమాని వాల్మీకిపుం మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కంభం నిరంజన్‌రెడ్డికి ఘన స్వాగతం పలికారు. అనంతరం బాణా సంచా పేల్చుతూ మంగళవాయిద్యాల నడుమ గణేష్ నిమజ్జన కార్యక్రమం అత్యంత విశిష్టంగా సాగింది. గణేష్ నిమజ్జన కార్యక్రమానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కిరి ధరణిహోటల్ అధినేత రాష్ట్ర రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు పులి సత్యనారాయణరెడ్డి కతజ్ఞతలు తెలిపారు.



# జీఓ 85కి వ్యతిరేకంగా వైద్యుల నిరసన

గాలివీడు, సెప్టెంబర్ 11(ప్రభాతవార్త):



జీఓ నెం.85కి వ్యతిరేకిస్తూ బుధవారం నూలివీడు, గాలివీడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వైద్యులు నిరసన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రైమరీ హెల్త్ సెంటర్స్ డాక్టర్లు అసోసియేషన్ పిలుపు మేరకు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్లు స్రవంతిరెడ్డి, శంకర్‌నాయక్, రాధమాధవి, రఫీలు మాట్లాడుతూ జీఓ 85 వల్ల తమకి మూడు సంవత్సరాల సర్వీసు అర్ధం లేకుండా పోతుందని అన్నారు. ప్రభుత్వం ఆకస్మాత్తుగా జీఓని మార్చడం అన్యాయమని తెలిపారు. దీని వల్ల తమ వృత్తి ప్రగతికి తీవ్రంగా నష్టం కలుగుతుందని అన్నారు. జీఓ రద్దు చేయాలని గత రెండు నెలలుగా అధికారులకు, మంత్రులకు వినతి అందించినప్పటికీ ఇంత వరకు అధికారుల వద్ద నుంచి ఎటువంటి సమాధానం రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కోవిడ్ సమయంలో తమ జీవితాలను ప్రమాదంలో పెట్టి సేవలందించామని, ఈ విషయం అధికారులు మరిచిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. జీఓ 85 ద్వారా పీజీ అవకాశాలు తగ్గించటం వల్ల గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో సేవలు ప్రభావితం చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా గణేషుని నిమజ్జన వేడుకలు

చెన్నూరు, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త



వినాయకచవితి సందర్బంగా చెన్నూరు శివాలయం నందు ఏర్పాటు చేసిన భారీ వినాయకుడికి పలు కార్యక్రమాలను నిర్వహకులు ఈ రోజు నిర్వహించడం జరిగింది. ఈ సందర్బంగా ఉదయం పూజా కార్యక్రమాలతోపాటు మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు. అలాగే వినాయకున్ని రంగురంగు పూలతో అలంకరించి దప్పువాయిద్యాలతో ఊరేగింపుగా బయలుదేరడం జరిగింది. భక్తులు పారవశ్యంతో ప్రతి గడప గడప దగ్గర నీళ్ల బిందెలతో స్వామి వారికి స్వాగతం పలుకుతూ తమ భక్తిని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో కోలాటం ప్రజలను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో భక్తులు, కల్లూరు విజయభాస్కర్‌రెడ్డి, అద్దంకి విశ్వనాథ్, ఓబులరెడ్డి, కిరణ్‌రెడ్డి నిర్వహకులు పాల్గొన్నారు.



## విద్యార్థులు ర్యాగింగ్ భూతానాకి ఆయడ దూరంగా ఉండాలి

రైల్వేకోడూరు అర్బన్, సెప్టంబర్ 11, ప్రభాతవవార్త :



కోడూరు మండలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు ర్యాగింగ్ భూతానికి దూరంగా ఉండాలని సిఐ హేమ సుందర రావు అన్నారు. బుధవారం కోడూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏపీసిసిఇ ఆదేశాల మేరకు స్టూడెంట్ ఇండక్షన్ ప్రోగ్రామ్‌లో భాగంగా యాంటీ ర్యాగింగ్ అనే అంశం పై విద్యార్థులకు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అథిదిగా కోడూరు సిఐ కె.హేమ సుందర్ రావు పాల్గొన్నారు. ఈ సందర్బంగా అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ విద్యార్థులు ర్యాంగింగ్ భూతానికి దూరంగా ఉండాలని తెలిపారు. యువత ముఖ్యంగా మాదక ద్రవ్యాలకు పాల్పడకుండా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలన్నారు. అందరూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదవడం శుభపరిణామం అన్నారు. తాను కూడా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదివి ఈ రోజు ఈ స్థితిలో ఉన్నానని తెలిపారు. విద్యార్థులు విద్యపై దృష్టి పెట్టి ఉన్నత చదువులు చదవాలన్నారు. ఆ విధంగా అడుగులు వేయుటకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల సరైనదన్నారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాలకు నూతనంగా వచ్చిన విద్యార్థులతో సీనియర్ విద్యార్థులు సోదర బావంతో వ్యవహరించాలని వారికి ఆదర్శంగా ఉండాలని విద్యలో వారికి ఏమైనా డౌట్లు తలెత్తితే వాటిని నివృతి చేయాలని తెలిపారు. అనంతరం శ్రీకాళహస్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం శ్రీలత మాట్లాడుతూ విధ్య యెక్క ఆవస్యకతను, ర్యాగింగ్ వల్ల వచ్చే దుష్పలితాలను వివరించారు. ఈ కార్యక్రమమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. రమేష్, ఐక్యూఏసి కోఆర్డినేటర్ జి.దయానందం కళాశాల యాంటీ ర్యాగింగ్ కమిటీ కన్వీనర్ జి.శ్రీనివాసులు ఆర్ఆర్‌సి కోఆర్డినేటర్ డాక్టర్ ఈ ప్రేమలత, యన్‌యస్‌యస్ కోఆర్డినేటర్ డాక్టర్ యస్. సుబ్రమణ్యరాజు యాంటి ర్యాగింగ్ కమిటీ సభ్యులు డి. వెంకటేశ్వర్లు, యస్ విశ్వనాధ విద్యార్థులు పాల్గొన్నారు.

## గిరిజనులకు త్రాగు నీరు అందించిన అధికారులు

రైల్వే కోడూరు అర్బన్,సెప్టంబర్11,ప్రభాతవవార్త :



నిన్నటి రోజున అనగా 10.09.2024వ తేదీన వార్తా దినపత్రికలో ప్రచురితమైన 'గిరిజనుల త్రాగునీటి కష్టాలు' అనే శీర్షికన ప్రచురితమైన వార్తకు అదికారులు స్పందించి గంగరాజుపోడు ఎస్టీ కాలనీలో మోటారు బిగించి గిరిజనులకు త్రాగునీరు అందించారు. కన్నీటి కష్టాలు పడ్డ గిరిజనులు కాస్తా ఊరట పడ్డారు. ఇంకో మోటారు ఉన్నప్పటికీ అందులో పూర్తిగా మురికి నీరు వస్తుండడంతో దానికి కూడా రిపేరు చేస్తామని తెలిపారు. ఈ సందర్బంగా కాలనీ వాసులు తమ కష్టాలను వార్త పత్రికలో వ్రాసి తమకు నీరు తెప్పించిన రిపోర్టర్ గంగరాజుకు ధన్యవాదాలు లెలిపారు అలాగే ప్రజల తరపున ప్రజల కష్టాలను తీరుస్తున్న ప్రభాతవార్తకు కూడా ధన్యవాదాలు తెలిపారు.

## మద్యాహ్నభోజనం నాణ్యతగా ఉండాలి

కురబలకోట, సెప్టెంబర్ 11 ప్రభాతవార్త :



మద్యాహ్నభోజనం విద్యార్థులకు నాణ్యమైనదిగా వండి వడ్డించాలని కురబలకోట ఎంపిడిఓ హరనారాయణ అన్నారు. బుధవారం మండల కేంద్రమైన కురబలకోట జడ్పిహైస్కూల్‌లోని మద్యాహ్న భోజన నిర్వహణపై ఆయన స్థానిక టిడిపి నాయకులు జంగా రాఘవరెడ్డితో కలసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తినకలిగేలా అన్నం, కూరలు ఒడ్డించాలన్నారు. స్టోర్ రూములో నిల్వ ఉన్న కూరగాయలు, నిత్యవసర సరుకులు పరిశీలించారు. అలాగే మంచినీరు విద్యార్థులకు అందించాలని నిర్వాహకులను కోరారు. మద్యాహ్న భోజనంపై విద్యార్థులను అడిగి తెలుసుకొన్నారు. ఆయన వెంట స్కూల్ హెచ్ఎం, ఉపాధ్యాయులు కలరు.

# 13న మండల స్థాయి క్రీడా పోటీలు

గాలివీడు, సెప్టెంబర్ 11(ప్రభాతవార్త):
మండల కేంద్రంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించడం జరుగుతుందని మండల విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఈ నెల 13వ తేదీన మండల స్థాయి క్రీడా పోటీలను విద్యాశాఖ అధికారుల ఆధ్వర్యంలో జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయులు మొయిద్దీన్‌బాషా తెలిపారు. అండర్-14 మరియు అండర్-19 బాల బాలికల విభాగంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్, యోగా, చెస్ మరియు అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రీడా పోటీలకు అధ్యక్షుడుగా హెచ్ఎం మొయిద్దీన్‌బాషా, మండల కోఆర్డినేటర్ పీడీ గంగరాజులు వ్యవహరిస్తారని తెలియజేశారు.

# 15న ఉచిత కంటి వైద్య శిబిరం

రామాపురం, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:
ఈనెల 15న ఆదివారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శ్రీవెంకటేశ్వర అరవింద కంటి ఆసుపత్రి తిరుపతి వారి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ రాయచోటి క్యాంప్ ఆర్గనైజర్స్‌లయన్ ఆంజనేయులురెడ్డి, లయన్ శ్రీనివాసులు యాదవ్ తెలిపారు. అదే రోజు కంటి పొర కంటిలో శుక్లాలు ఉన్న వారికి ఉచిత కంటి ఆపరేషన్‌కు ఎంపికైన వారిని తిరుపతి ఆసుపత్రికి తీసుకెళ్తారన్నారు. దగ్గర చూపు, దూరపు చూపు సమస్యలు ఉన్న వారిని ఇక్కడే పరీక్ష చేస్తామన్నారు. కంటి అద్దాలు అవసరం ఉన్న వారికి శిబిరం వద్దనే తక్కువ ధరకు కంటి అద్దాలు ఇస్తారన్నారు. షుగర్, బీపీ లాంటి సమస్యలను వారు నార్మల్‌గా ఉన్నట్లు సర్టిఫికెట్ తీసుకురావాలన్నారు. వలయంతో మీరు వాడే మందు చీటీలు తీసుకురావాలన్నారు. ఈ అవకాశాన్ని మండల ప్రజానీకం సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఉచిత కంటి వైద్య శిబిరానికి వచ్చే వారు ఆధార్‌కార్డు తప్పక తీసుకురావాలన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు



ముద్దనూరు, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త:

జమ్మలమడుగు-ముద్దనూరు ఘాట్ రోడ్‌లోని మునయ్యకోన సమీపంలో బుధవారం ఉదయం జరిగిన ప్రమాదంలో ఇరువురికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే జమ్మలమడుగు మండలంలోని దత్తలూరు గ్రామానికి చెందిన 25సంవత్సరాల ముల్లా ఇమ్రాన్ మరియు 60 సంవత్సరాల కొండపల్లి ఇబ్రహీం వీరిద్దరూ జమ్మలమడుగు నుంచి ముద్దనూరుకు స్కూటీలో వస్తుండగా మునయ్య స్వామి కోన దాటాకా కొండ డౌన్‌లో టూ వీలర్ అదుపుతప్పి లోయలో పడ్డారు. తెల్లవారుజామున చీకట్లో నాలుగున్నరకు ప్రమాదం జరిగిందని 108 అంబులెన్స్‌కు సమాచారం అందించి వీరు ఇరువురిని పది అడుగుల లోయలో పడిపోవడంతో అతి కష్టం పైన 108 సిబ్బంది ఇఎంటి మహేష్, పైలెట్ సుబ్రమణ్యం అంబులెన్స్‌లో తీసుకొని వైద్యం చేస్తూ జమ్మలమడుగు గవర్నమెంట్ హాస్పిటల్‌లో చేర్పించారు. వారిరువురికి కాళ్లు విరిగినట్లు వైద్యులు తెలిపారు. యాక్సిడెంట్ జరిగిన ప్రదేశాన్ని ముద్దనూరు పోలీసులు పరిశీలించి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## ఘనంగా వినాయక చవితి వేడుకలు

ముద్దనూరు, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త:



ముద్దనూరు టౌన్‌లోని వినాయక చవితి సందర్భంగా స్థానిక కొత్తకట్టాలు వీధిలో శ్రీ గురు యువసేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విగ్రహం వద్ద బుధవారం నాయీ బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షులు గుర్రప్ప ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా మాజీ ఎంపీటీసీ వరదారెడ్డి, మండల స్థాయి వైసీపీ యువనేత డాక్టర్ చింతా నవజ్యోత్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఓబులేస్ యాదవ్, షరీఫ్, రంగనాయకులు, కొండయ్య, గురుతేజ, దస్తగిరి, ప్రదీప్, అనిల్, భక్తులు పాల్గొన్నారు.

## మట్కా బీటర్ అరెస్ట్-నగదు స్వాధీనం

ముద్దనూరు, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త:



ముద్దనూరు టౌన్‌లోని స్థానిక పాత బస్టాండ్ సమీపంలో మట్కా రాస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ మైనుద్దీన్ తెలిపిన వివరాల మేరకు ముద్దనూరు టౌన్‌కు చెందిన బాబా ఫకృద్దీన్ గత కొద్ది కాలంగా మట్కా, జూదాన్ని నిర్వహిస్తున్నట్లు బుధవారం నాడు విశ్వసనీయ వర్గాల ద్వారా ఎస్ఐకు రాబడిన సమాచారంతో తోటి సిబ్బందితో దాడి చేసి బాబా ఫకృద్దీన్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి మట్కా స్లిప్పులు, బాల్ పెన్ను, 7310రూపాయల నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## జీవనజ్యోతి స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

యర్రగుంట్ల, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త:



యర్రగుంట్లలోని జీవనజ్యోతి స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య యర్రగుంట్ల మండల సమితి డిమాండ్ చేసింది. నైపుణ్యం లేని డ్రైవర్లను తక్కువ జీతాలు పెట్టుకోవడం ద్వారా విద్యార్థుల ప్రాణాలను పణంగా పెట్టి తమ లాభాలు ఆర్జించడమే ధ్యేయంగా స్కూలు యాజమాన్యం ప్రవర్తించడం సరికాదని విమర్శించారు. మంగళవారం ఉదయం ముద్దనూరు రోడ్డులో కదిరి వారి పల్లె క్రాస్ దగ్గర ముందు వెళుతున్న ద్విచక్ర వాహణాన్ని ఢీ కొనడంతో ఆ వ్యక్తికి తీవ్ర గాయాలు పాలు కావడం జరిగింది. స్కూలు యాజమాన్యం గాయపడిన వ్యక్తికి నష్ట పరిహారం చెల్లించడంతో పాటు నైపుణ్యం గల డ్రైవర్లను ఉంచుకోవాలని అప్పుడే విద్యార్థుల ప్రాణాలకు భద్రత ఉంటుందని తెలిపారు. స్కూల్ బస్సులో సెట్టింగ్ కెపాసిటి మించి విద్యార్థులను ఎక్కిస్తున్నారన్నారు. ముందు సారి యాక్సిడెంట్ జరిగింది అయినా కానీ విద్య అధికారులు, పోలీస్ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోతే పెద్దఎత్తున సీపీఐ, ఏఐవైఎఫ్ సంఘాలతో ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జమ్మలమడుగు ఏరియా కార్యదర్శి శరత్‌కుమార్, మండల కార్యదర్శి లీలా కృష్ణ, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

## ఘణంగా వినాయకుని నిమజ్జనం

యర్రగుంట్ల, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త:

యర్రగుంట్ల మండల పరిధిలోని కదిరి వారి పల్లెలో కులమత బేధం లేకుండా వినాయక చవితిని ఘనంగా జరిపారు. బుధవారం రోజున గ్రామ పెద్దలు, యువకులు పెద్దఎత్తున పాల్గొని నిమజ్జన కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

## వినాయక విగ్రహం వద్ద పూజలు నిర్వహించిన మాజీ ఎమ్మెల్సీ

జమ్మలమడుగు, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:

జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డులో బుధవారం కసింరెడ్డి కుళాయిరెడ్డి ఇంటి వద్ద వినాయకున్ని మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ కార్యక్రమం

పెండ్లిమర్రి, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:



మండలంలోని మండల సమాఖ్యలో ప్రకృతి వ్యవసాయంపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి అడిషనల్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వసంతకుమారి మాజరై ప్రసంగించారు. ప్రతి మహిళా రైతులు ఇంటి వద్ద పెరటి తోటలు పెంచుకోవాలని శిక్షణలో సూచించారు. అనంతరం సందీప్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలోని సిబ్బంది విధులు బాధ్యతలు తెలిపారు. వెంకటేశ్వరరావు ఏపీఎం వెలుగు సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

## అనారోగ్యంతో ఎంపీటీసీ మృతి

దువ్వూరు, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త:



మండల పరిధిలోని నీలాపురం ఎంపీటీసీ నాయనీ సుబ్బరాయుడు(70) అనారోగ్యంతో బుధవారం మృతిచెందాడు. ఇతను నీలాపురం ఎంపీటీసీగా ఉన్నారు. నీలాపురం ఎంపీటీసీగా ఉంటూ దాసరిపల్లెలో నివాసం ఉంటున్నాడు. గత రెండు సంవత్సరాలుగా అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతి చెందాడు. వైకాపా పార్టీలో సీనియర్ నాయకుడిగా ఉంటూ మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి అనుచరుడిగా కొనసాగాడు. ఈయన మృతి వార్త తెలుసుకొని మాజీ ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి, ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి, వీవీ స్వామి తదితరులు ఎంపీటీసీ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## కలికిరిలో సబ్ కలెక్టర్ సుడిగాలి పర్యటన

కలికిరి, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:



మండలంలో బుధవారం మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా కలికిరి మండలంలో జరుగుతున్న ఫ్రీ హోల్డ్ భూముల రీ వెరిఫికేషన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. కలికిరి మండలంలో ఫ్రీహోల్డ్‌లో సుమారు 4640 ఎకరాల్లో భూములున్నాయి. ఈ భూములను ఇప్పటికే ప్రభుత్వం రీ వెరిఫికేషన్ చేయాలని ఆదేశాలివ్వడం జరిగింది. దీంతో రీ వెరిఫికేషన్ కార్యక్రమాన్ని సబ్ కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మర్రికుంటపల్లె పంచాయతీలో రెవెన్యూ అధికారులు నిర్వహిస్తున్న రీ వెరిఫికేషన్ తనిఖీ చేసి రెవెన్యూ సిబ్బందికి సూచనలు చేశారు. ఈ కార్యక్రమాన్ని మండలంలో వేగవంతం చేయించాలని మండల తహసీల్దారు మహేశ్వరీ బాయ్‌ని ఆదేశించారు. మండలంలో ఇప్పటికే 50% ఫ్రీహోల్డ్ రీవెరిఫికేషన్ జరిగింది. ఈ కార్యక్రమాన్ని రెవెన్యూ సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి వేగవంతం చేయాలన్నారు. అనంతరం గుండ్లూరు పంచాయతీలో ఓ రైతు తమ వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా చేయాలని దరఖాస్తు చేసుకున్నారు. ఆ భూమిని సబ్ కలెక్టర్ పరిశీలించారు. అనంతరం సబ్ కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి ఆ సమస్యలు వెంటనే పరిష్కరించి రైతులు, ప్రజలు ఇబ్బందులు పడకుండా చూడాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. సబ్ కలెక్టర్ వెంట కలికిరి మండలం తహసీల్దార్ మహేశ్వరీభాయ్, మండల సర్వేయర్ దేవి, వీఆర్ఓలు నరేష్, వెంకటేష్, గుండ్లూరు పంచాయతీ సర్వేయర్ విజయలక్ష్మీ, గుండ్లూరు పంచాయతీ సర్వేయర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## విజయవాడ వరద విపత్తులో చంద్రబాబు విఫలం

మాజీ ఎమ్మెల్యే రాచమల్లు

ప్రొద్దుటూరు అర్బన్, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త:




మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి బుధవారం వైఎంఆర్ కాలనీలోని వైసీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి నివాసంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తన అసమర్ధను కప్పిపుచ్చుకునేందుకే చంద్రబాబు బోటు డ్రామ ఆడుతున్నారని, బోటు ఢీ కొనడం వలన ప్రకాశం బ్యారేజ్ డ్యామేజి అవుతుందనడం అవివేకమన్నారు. వాతావరణ శాఖ, రెవెన్యూ శాఖ అధికారుల ఆదేశాలు వేఖాతారు చేయడం సమంజసం కాదన్నారు. విజయవాడ వరద విపత్తు సమయంలో చంద్రబాబు విఫలం అయ్యారని, కరోనా సమయంలో అప్పటి ముఖ్యమంత్రి జగన్ ప్రజలకు చేసిన సేవలో సక్సెస్ అయ్యారని వివరించారు. గత వారం రోజులుగా విజయవాడ పట్టణానికి జరిగిన నష్టానికి సంబంధించి ఆంధ్రప్రదేష్ రాష్ట్ర ప్రజలందరికి అందరినీ కలిచి వేసిందని, ఈ విపత్తు ఏర్పడడానికి కారణం ప్రకృతా పాలకుల అని ఆత్మ విమర్శ చేసుకోవాలన్నారు. వాతావరణ శాఖ, రెవెన్యూ అధికారులు పెద్దఎత్తున వర్షం వస్తుందని ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారని, కానీ చంద్రబాబునాయుడు ప్రభుత్వం అప్రమత్తంగా వ్యవహరించలేదన్నారు. బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడమే ఈ ప్రజా, ఆస్థి నష్టానికి కారణం అన్నారు. చంద్రబాబు నాయుడు ప్రభుత్వం వరదలకు అప్రమత్తమవ్వడంతో, ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడంలో, పునరావాసా చర్యలు చేపట్టడంలో విఫలమైందని విమర్శించారు. ప్రజలకు కావలసిన సౌకర్యాలు లేవన్నారు. కరకట్ట మీద ఉన్న చంద్రబాబు నాయుడు ఆస్థులు మునిగిపోకుండా ఉండటానికో ఓ మీడియా, పత్రిక(వార్త కాదు) అధినేత రాధాకృష్ణ ఆస్థులు మునిగిపోకుండా ఉండటానికో ప్రజలకు ఇక్కట్లకు గురి చేయడం సరికాదని వివరించారు. తెలిసి 47మంది మరణించారని ఈ మరణాలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రభుత్వమే కారణమని తెలియక ఇంకా ఎంతమంది మరణించారో తెలియదన్నారు. ప్రమాదం సంభవించాకైన ఏ మేరకు సహాయక చర్యలు అందించిందని చేస్తే వేలమంది ప్రజలు విమర్శిస్తున్నారన్నారు. ఆపన్న హస్తం అందించాల్సిన ప్రభుత్వమే విఫలమైతే ప్రజలకు రక్షణ ఎక్కడ ఉందని ప్రశ్నించారు. వరద బాధితులకు నిలబెట్టేందుకు కావలసిన అన్ని వసతులకు విరాళాలు సేకరించినందుకు పిలుపు ఇవ్వాలని, జగన్‌మోహన్ రెడ్డి పిలుపునిస్తే 175 నియోజకవర్గాల్లో వైసిపీ నాయకులు ముందుకు వచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వంలో భాగస్వామి అయిన బీజేపి ప్రభుత్వం ఈ రాష్ట్రాన్ని ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శేఖర్ యాదవ్, మున్సిపల్ చైర్మెన్ భీమునిపల్లె లక్ష్మిదేవి, కౌన్సిలర్లు పాతకోట మునివంశీధర్ రెడ్డి, గరిశపాటి లక్ష్మిదేవి, గుర్రం లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## బాల్ బ్యాడ్మింటన్‌కు బాల బాలికల జట్టు ఎంపిక

దువ్వూరు, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త:



వైఎస్ఆర్ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సబ్ జూనియర్స్ బాల బాలికల కోచింగ్ క్యాంపును మండలంలోని చల్ల బసాయిపల్లె గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు 7వ తేది నుంచి బుధవారం వరకు జరిగింది. క్యాంపు అనంతరం అన్నవరంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఉమ్మడి కడప జిల్లా బాల బాలికల జట్లను ఎంపిక చేశారు. ఈ కోచింగ్ క్యాంప్‌లో ప్రతిభ కలిగిన బాలుర విభాగం నుంచి 10మందిని, బాలికల విభాగం నుంచి 10మందిని ఎంపిక చేశారు. సబ్ జూనియర్ బాలుర జట్టు–డీ.షద్రక్(చిన్న సింగనపల్లె), జీ.వెంకట నాగచరణ్(గొరిగనూరు), ఎస్. షాజిబ్(రాజంపేట), డీ.రఫెల్(చిన్న సింగనపల్లె), కె.కౌశిక్(రాజంపేట), మహమ్మద్ బాబా(జానీ బాషాపురం), డీ.అఖిల్(చిన్న సింగనపల్లె), ఎస్.సుచీంద్ర (జమ్మలమడుగు), ఎస్.వెంకటయ్య(దువ్వూరు), కె.జోయల్(జమ్మలమడుగు), సబ్ జూనియర్ బాలికల జట్టు– కె.సలోమి, డి.నయోమి, డీ.కీర్తి(చల్ల బసాయిపల్లె), ఈ.సౌమ్య, ఏ.భావణ(ప్రొద్దుటూరు), ఎం.షాలిని ప్రియ(రాజంపేట), ఎం.స్వీటి(జమ్మలమడుగు), వైష్ణవి, చెన్నమ్మ, తనుశ్రీలు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పచ్ లక్ష్మి నారాయణరెడ్డి, ప్రధానోపాధ్యాయులు జయరాంరెడ్డి, జిల్లా అసోసియేషన్ సెక్రటరీ వెంకటరమణ, జాయింట్ సెక్రటరీ సురేంద్ర మరియు సీనియర్ క్రీడాకారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బ్రహ్మంగారి హుండి ఆదాయం రూ.14.76 లక్షలు

బ్రహ్మంగారిమఠం, సెప్టెంబరు 11 ప్రభాతవార్త :



జగద్గురు శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దర్శనానికి అలాగేమొక్కుబడి భక్తుల కానుకల రూపంలో సమర్పించిన హుండి ఆదాయం లెక్కించగా రూ.14,76,750లు నగదు, 15 గ్రాముల 200 మి.గ్రాముల బంగారు, 208 గ్రాముల వెండి ఆదాయం వచ్చినట్లు దేవాదాయశాఖ ఫిట్‌పర్సన్ శంకర్‌బాలాజీ తెలిపారు. ఈ హుండి లెక్కింపునకు దేవాదాయ శాఖ తిరుపతి ఇన్‌స్పెక్టర్ ఫణీంద్రకుమార్, పూర్వపు మఠాధిపతుల కుమారులైన వెంకటాద్రి స్వామి, వీరభద్రయ్య స్వామి, వీరంబొట్ల య్య స్వామి, గోవిందస్వామి, మేనేజర్ ఈశ్వరయ్యాచారి ల సమక్షంలో చెన్నూరుకు చెందిన శ్రీనివాస గోవింద సేవా సమితి మరియు భక్తులు ఆలయ సిబ్బంది ఈ లెక్కింపు కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయం ఆలయ బాగోగులు, అభివృద్ధి పనులకు ఉపయోగిస్తున్నామని ఫిట్‌పర్సన్ శంకర్‌బాలాజీ తెలిపారు.

## వినాయక విగ్రహాల వద్ద ఘనంగా అన్నదాన కార్యక్రమాలు

లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబర్ 11, ప్రభాతవార్త:

మండల పరిధిలోని డి.రామాపురం, కస్తూరి రాజుగారి పల్లి మద్దిరేవుల, దీయలవాండ్లపల్లి, పిచ్చికుంటపల్లి, బిల్డింగ్ హరిజనవాడ పాలెం, గొల్లపల్లె, దాదాపుగా 30 వినాయక విగ్రహాలు సమీపంలోని దొరిచెరువులో నిమజ్జనం చేశారు. మండలంలోని వినాయక విగ్రహాల వద్ద పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. మూడు రోడ్ల కూడలిలో శ్రీకాంత్ స్టూడియో, బాలాజీ ఫ్యాన్సీ స్టోర్ వారి ఆధ్వర్యంలో, గద్దగుండ్ల రాజు పల్లెలో కొండూరు శ్రీధర్ రాజు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. దప్పేపల్లి గ్రామం డి రామాపురం యూత్ ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవాలలో లడ్డు వేలం పాటలో 25 వేల రూపాయలకు పురం నాగేశ్వర గొర్ల రామకృష్ణ కుమారులు పురం నాగార్జున గొర్ల బాలాజీ లు దక్కించుకున్నారు. వినాయక విగ్రహాలను కోలాటాలు, భజనలు, డీజేలతో ఘనంగా ఊరేగింపు చేస్తూ నిమజ్జనానికి తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు టైప్ రమణ, హోటల్ రమణ, అడ్వకేట్ చెన్న కృష్ణయ్య, మీసేవ నాగేంద్ర మనోజ్ సాయి పాల్గొన్నారు.

## పీఎం విశ్వకర్మ యోజన పథకం కింద రిజిస్ట్రేషన్ల నిమిత్తం వృత్తి పని వారిలో అవగాహన పెంచండి

- చేతివృత్తుల వారు సద్వినియోగం చేసుకోవాలి - జిల్లా కలెక్టర్ శ్రీదర్ చామకూరి

రాయచోటి, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:



కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకం కింద రిజిస్ట్రేషన్ల నిమిత్తం చేతి వృత్తి వారిలో అవగాహన పెంచాలని జిల్లా కలెక్టరు శ్రీధర్ చామకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియోకాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం అమలుపై సంబంధిత శాఖల అధికారులు, సభ్యులతో జిల్లా స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పీఎం విశ్వకర్మ యోజన పథకం కింద 18 రకాలైన చేతి వృత్తుల వారికి ఆర్థిక సహాయం అందించేందుకు ఈ కార్యక్రమాన్ని 2023 సెప్టెంబరు 17న కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. ఈ పథకం కింద ఎంపికై ప్రాథమిక శిక్షణ పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు మొదటి విడతలో రుణ సౌకర్యం అందించడం జరుగుతుందన్నారు అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. జిల్లాకు నిర్దేశించిన లక్ష్యం పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖాధికారి సూరిబాబు, డీపీవో ధనలక్ష్మి, డీఆర్డీఏ పీడీ సత్యనారాయణ, జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారి లక్ష్మీనారాయణ, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరికృష్ణ, మున్సిపల్ కమిషనర్లు, వివిధ శాఖల అధికారులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## వరద బాధితుల మధ్య చంద్రబాబు

- విలాసవంతమైన ప్యాలెస్‌లో జగన్‌రెడ్డి
- జగన్‌రెడ్డి అధికారంలో సరదాలు చేసుకొని ఇప్పుడు రాజకీయాలు మాట్లాడుతున్నారు
- తెదేపా రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా

రాయచోటి, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:



మాజీ సీఎం జగన్‌రెడ్డి రాష్ట్రంలో బురద రాజకీయాలు చేస్తున్నారని తెదేపా రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్ బాషా, కుప్పం నియోజకవర్గ పరిశీలకులు గాజుల ఖాదర్‌బాషా అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జగన్ బెంగళూరు ప్యాలెస్‌లో ఉంటూ పంచభక్ష పరమాన్నాలు తింటూ విజయవాడలో వరద బాధితుల మధ్య మోకాళ్ల లోతులో పర్యటిస్తూ బాధితులకు సహాయ సహకారాలు అందిస్తున్న చంద్రబాబును విమర్శించడం జగన్ దగుల్బాజీ తనానికి నిదర్శనమని తీవ్రంగా దుయ్యబట్టారు. బుడమేరు వరదలు రావడానికి కారణం జగనే అని రాష్ట్ర ప్రజలంటున్నారన్నారని దానికి సమాధానం చెప్పే దమ్ముందా అని ప్రశ్నించారు. చంద్రబాబునాయుడు రోజుకు 22 గంటలు పనిచేస్తూ గంట రెండు గంటలు మాత్రమే నిద్రపోతున్న దార్శనికుడని అలాంటి చంద్రబాబును జగన్ విమర్శించడం తగదన్నారు. అన్నమయ్య డ్యాం కొట్టుకుపోవడానికి కారణం కూడా జగనే అని తెలిపారు. ఇసుక మాఫియా లబ్ధి కోసమే 33 మంది చనిపోవడానికి జగన్ కారకుడయ్యాడన్నారు. విజయవాడలో వచ్చిన వరదలకు అనేక మంది నాయకులు, హీరోలు, సామాన్య ప్రజలు విరాళాలు అందించారు. వరదల్లో ఇంత నష్టం జరిగినా రూ.లక్షల కోట్లున్న సంపాదించిన జగన్ రూ.కోటి విరాళం ఇవ్వడం ఇది కార్యకర్తల ద్వారా పంపిణీ చేయడం హాస్యాస్పదమన్నారు. బురద రాజకీయం చేస్తున్న జగన్‌కు రాష్ట్ర ప్రజలు సరైన సమాధానం చెప్పారన్నారు. చంద్రబాబు పది రోజుల నుంచి కలెక్టర్ కార్యాలయంలోనే ఉండి ఆయన చేస్తున్న పనితీరును కేంద్ర మంత్రులతో సహా అభినందిస్తున్నారని వైసీపీ నాయకులకు ధైర్యం ఉంటే ప్రజా క్షేత్రంలోకి రావాలన్నారు. ఈ సమావేశంలో తెదేపా నాయకులు వెంకటరమణారెడ్డి, జయరామిరెడ్డి, అంజాద్ అలీఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## కేజీబీవీ పాఠశాలల్లోకి ఇతరులను అనుమతించరాదు

- ప్రతి పాఠశాలలో విద్యార్థుల హాజరు వంద శాతం ఉండాలి
- విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం ఇవ్వాలి - జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి



రాయచోటి, సెప్టెంబరు 11, ప్రభాతవార్త:

కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలలలోకి బయటి వ్యక్తులను అనుమతించినట్లయితే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి కేజీబీవీ ప్రధానోపాధ్యాయులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కలెక్టర్ కేజీబీవీ, ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాళ్లతో సమావేశం నిర్వహించారు. లక్కిరెడ్డిపల్లె అంబేద్కర్ గురుకుల పాఠశాలలో జరిగిన సంఘటనను దృష్టిలో ఉంచుకొని అలాంటి ఘటనలు ఎక్కడా పునరావృతం కాకుండా కేజీబీవీ పాఠశాలల ప్రిన్సిపల్స్ జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రతి పాఠశాలలో విద్యార్థుల అటెండెన్స్ వంద శాతం నమోదు కావాలన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం ఇవ్వాలని ప్రతి పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేయడం జరుగుతుందని విద్యార్థులకు మెనూ ప్రకారం ఇవ్వకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జేసీ ఆదర్శ రాజేంద్రన్, రాజంపేట సబ్ కలెక్టర్ నదియా దేవి, కేజీబీవీ పాఠశాలలు, ఏపీ మోడల్ స్కూల్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## క్రియాశీలకంగా బలపడుతున్న జనసేన

బద్వేలు, సెప్టెంబరు 11 ప్రభాతవార్త :

జనసేన క్రియాశీలకంగా పూర్తిస్థాయిలో బలపడుతుందని జనసేన సమన్వయకర్త బసివి రమేష్ అన్నారు. ఈ మధ్య జరిగిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో అన్ని ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున జనసేన సభ్యత్వం పొందారన్నారు. దీని ఆధారంగా రాష్ట్రంలో జనసేన తన ఉనికిని చాటుకుంటుందని క్రియాశీలకంగా బలపడేందుకు ప్రతి కార్యకర్త కృషిచేస్తున్నారన్నారు. ఉపముఖ్యమంత్రి , జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ పార్టీ కోసం అహర్నిషలు పనిచేశారని అదే స్థాయిలో కార్యకర్తలు వెన్నంటి నడిచారన్నారు. ఈరోజు బలమైన శక్తిగా జనసేన ముందుకు సాగుతుందని వారు పేర్కొన్నారు. ఇప్పటికే రెండు రాష్ట్రాలలోనూ జనసేనకు ఆదరణ ఎక్కువగా ఉందని ఇలాగే అహర్నిషలు శ్రమించి ముందుకు సాగాలని పార్టీ అధ్యక్షులు దిశానిర్దేశం చేస్తున్నారన్నారు. ఒకరేమి చేసినదానికన్నా , మనమేం చేశామనేదే ముఖ్యంగా పార్టీ ముందుకు సాగుతుందని జనసేనపై ప్రజలు ఇంత ఆదరణ పెట్టుకున్న నేపథ్యంలో వారికి కూడా అండగా ఉండాలన్న ఉద్దేశ్యంతో పవన్ కళ్యాణ్ నిరంతరం ప్రజలబాట పడుతున్నారన్నారు. రాష్ట్రాభివృద్ధికి ఇదే మంచి అవకాశంగా భావించి పవన్ కళ్యాణ్ చేతిలో ఉన్న పదవికి న్యాయం చేయాలనే ఉద్దేశ్యంతో ప్రతి పంచాయతీని అభివృద్ధి చేసి పూర్వ వైభవం తెచ్చేందుకు కృషిచేస్తున్నారని కొన్ని అనివార్య సంఘటనల వలన విపత్తు రావడం జరిగింది కానీ, లేకుంటే ఇప్పటికే అన్ని పంచాయతీలలో అభివృద్ధి ప్రారంభమయ్యేదన్నారు. అనుకున్న లక్ష్యం నెరవేరే ంతవరకు డిప్యూటి సీఎం పవన్ కళ్యాణ్ నిద్రపోరని కొనియాడారు.

## గణనాథునికి వీడ్కోలు పలికిన 5వ రోజు ఘనంగా నిమజ్జనాలు

బద్వేలు, సెప్టెంబరు 11 ప్రభాతవార్త :



5వ రోజు వినాయకునికి వీడ్కోలు పలికి వైభవంగా నిమజ్జనం చేపట్టారు. భక్తి, శ్రద్ధలతో 5 రోజుల పాటు విఘ్నేశ్వరుడిని కొలిచిన భక్తులు ప్రతిరోజూ ఒక కార్యక్రమంతో భక్తులకు కనువిందుచేయడంతో తమభక్తిని చాటుకున్నారు. పట్టణంలో ఐదు రోజులు అనేక వినాయకుని విగ్రహాలు నిమజ్జనానికి బయలు దేరాయి. వందల సంఖ్యలో ఏర్పాటు చేసిన విగ్రహాలు మూడు, ఐదు రోజులకు 90 శాతం పూర్తిగా నిమజ్జనం చేయడంతో కేవలం కొన్నిమాత్రమే నిమజ్జనానికి సిద్దంగా ఉన్నాయి. 5వ రోజు బుధవారం వినాయకుని ఊరేగింపు వెంట భక్తి కార్యక్రమాలు కోలాటాలు, దేవుని భక్తి, గీతాలతో ఎలాంటి ఇబ్బంది లేకుండా నిమజ్జన కార్యక్రమం పూర్తిచేశారు. పోలీసుల సూచనల మేరకు డీజేలు పెట్టకుండా కేవలం భక్తిగీతాలు, సందేశాలతో మాత్రమే నిమజ్జనం చేపట్టాలని చేసిన సూచనల మేరకు తూ.చ.తప్పకుండా భక్తులు నిబందనలు పాటించారు. మిద్దెలవారిపాళెం, శాస్త్రినగర్, గాండ్లవీధి, కొండారెడ్డి వీధి, ఆంజనేయనగర్, వీరభద్ర స్వామి గుడి, అమ్మవారిశాల ప్రదేశాలలో ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమలు నేడు నిమజ్జనానికి తరలివెళ్లాయి. మిద్దెలవారిపాళెంలో లడ్డు వేలంపాట రూ.40వేలు పాడగా , వెంకటయ్యనగర్‌లో కూడా రూ.40వేలకు పైగా లడ్డూ వేలంపాటలో దక్కించుకున్నారు. ఇలా ప్రతి ప్రాంతంలో దేవునివద్ద ఉంచి పూజలు నిర్వహించిన ప్రసాదం, చెరకుగడలు, దీపారాధనలు లాంటివి దక్కించుకోవడం వలన అష్టైశ్వర్యాలు కలుగుతాయనే ఉద్దేశ్యంతో భక్తులు పోటీపడి వేలంపాటలో పాల్గొని స్వామి ప్రసాదం దక్కించుకున్నారు.